పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక :48 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 22 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :48 PAGES :8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : VISAKHAPATNAM THU 22 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి

అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

- నిత్యవసరాల ధరల పెరుగుదలను నియంత్రించాలని సీఎం ఆదేశం
- ఎల్ నినో ప్రభావం ప్రజలపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచన
- పీఎం సూర్యఘర్ కనెక్షన్ల ఏర్పాటును వేగవంతం చేయాలన్న చంద్రబాబు
- ఇసుక, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం

రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలపై భారం పడకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ధరలు పెరుగుతున్నాయని, దాని ప్రభావం రాష్ట్రంపై పడకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

పెన్ పవర్ డెస్క్:ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బియ్యం, కందిపప్పు, ఉల్లి, వంటనూనె, పంచదార వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అమ్మకాలపై ఆయన ఆరా తీశారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అధికారులు వివరించగా.. దీపావళి, సంక్రాంతి పండుగల సమయంలో కూడా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. మార్కెట్‌లో ఉల్లిపాయల సరఫరాను మరింత పెంచి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం

- మిగతా 2లో

ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

- నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారంటూ వైసీపీ పిటిషన్
- అభ్యర్థుల తుది జాబితా ప్రచురణను నిలిపివేయాలని సుప్రీం ఉత్తర్వులు
- సుప్రీంకోర్టు సూచనలతో ఎస్ఈసీ కీలక నిర్ణయం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో 19 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) తాత్కాలికంగా నిలిపివేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాసేపటి క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ నిలిచిపోయాయి.రాష్ట్రంలో అధికార పక్షం వేధింపుల కారణంగా పలు ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని, వారిని అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని, గడువు పొడిగించి తగిన రక్షణ కల్పించాలని పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరగడం రాజ్యాంగ మౌలిక సూత్రమని స్పష్టం చేసింది.ఈ నేపథ్యంలో, వైసీపీ చేసిన ఫిర్యాదులను, సమర్పించిన ఆధారాలను కేసుల వారీగా పరిశీలించి అక్టోబర్ 22వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని

- మిగతా 2లో

1986 నుంచే నా దగ్గర రివాల్వర్ ఉంది

మాజీ మంత్రి మల్లారెడ్డి కామెంట్స్ వైరల్

పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తన రివాల్వర్ గురించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దసరా పండుగ ఆయుధ పూజలో పాల్గొన్న ఆయన.. రివాల్వర్ చూపిస్తూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. విజయదశమి సందర్భంగా హైదరాబాద్ బోయినపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తన రివాల్వర్‌కు పూజలు చేసిన అనంతరం

- మిగతా 2లో

వాయు కాలుష్యం ఎఫెక్ట్.. మళ్లీ ఆంక్షల చట్రంలోకి ఢిల్లీ

పెన్ పవర్ డెస్క్: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ పడగ విప్పుతోంది. స్థానికంగా వాయు నాణ్యత సూచీ (ూాు×) దిగజారడంతో 'సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (జూాువీ)' ఈ సీజన్‌లో తొలిసారి ఆంక్షలు విధించింది. ఢిల్లీ - ఎన్‌సీఆర్ పరిధిలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-1 (+=ూ్రా-1) నిబంధనలను తక్షణమే అమల్లోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సీఏక్యూఎం ఛైర్‌పర్సన్ రాజేశ్ వర్మ అధ్యక్షతన ఢిల్లీ ఉన్నతాధికారులు, పలు ప్రభుత్వ ఏజెన్సీలతో సమీక్షా సమావేశం జరిగింది. నగరంలో వాయు కాలుష్య సమస్యలను సమీక్షించడంతో పాటు రాబోయే రోజుల్లో కాలుష్య నివారణ చర్యల్ని బలోపేతం చేయడంపై చర్చించారు.

- మిగతా 2లో

విజయనగరం కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ తేదీ మార్పు

- అక్టోబర్ 28కి బదులుగా 29న పోలింగ్ నిర్వహణ
- పైడితల్లి సిరిమాను ఉత్సవం కారణంగా ఎస్ఈసీ నిర్ణయం
- అక్టోబర్ 30న యథాతథంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

విజయనగరం నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ తేదీలో మార్పు జరిగింది. ముందుగా ప్రకటించినట్లు అక్టోబర్ 28న కాకుండా, అక్టోబర్ 29న పోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) స్పష్టం చేసింది. ప్రసిద్ధ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం కారణంగా ఈ నిర్ణయం

- మిగతా 2లో

మంగళగిరిలో వైసీపీకి షాక్.. లోకేశ్ సమక్షంలో

టీడీపీలో చేరిన కీలక నేత

- మంగళగిరిలో టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు
- మంత్రి లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేత రజనీకాంత్
- స్థానిక ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో గెలవాలని పిలుపు
- మంగళగిరిలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న లోకేశ్
- రజనీకాంత్‌తో పాటు టీడీపీ తీర్థం పుచ్చుకున్న 25 కుటుంబాలు

- మిగతా 2లో

హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు

పంతంగి వద్ద నెమ్మదిగా కదులుతున్న వాహనాలు

- దసరా సెలవులు ముగియడంతో పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీ రద్దీ
- హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాలతో కిక్కిరిసిన టోల్‌గేట్
- స్కూళ్లు, కాలేజీలు తిరిగి ప్రారంభం కావడంతో ఒక్కసారిగా పెరిగిన రద్దీ
- 12 టోల్ బూతులు తెరిచి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న అధికారులు
- చిట్యాల, చౌటుప్పల్ వద్ద నిర్మాణ పనులు కూడా ట్రాఫిక్‌కు కారణంగా గుర్తింపు

- మిగతా 2లో

జగన్ ఒక క్రిమినల్ లిటిగెంట్

చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు

- పిటిషన్లతో ఎన్నికలు, అభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని ఆరోపణ
- జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకోవాలని నేతలకు సూచన
- క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు

పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభ్యర్థులు, బూత్ స్థాయి కార్యకర్తలతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయాల్లో జగన్ లాంటి 'క్రిమినల్ లిటిగెంట్లు' ఉండటం అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.తానే విధ్వంసానికి పాల్పడి, తానే కోర్టుకు వెళ్లే వికృత ఆలోచనలు జగన్‌కే వస్తాయని చంద్రబాబు అన్నారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ, అభివృద్ధిని, ఎన్నికలను అడ్డుకోవడమే

- మిగతా 2లో

ఉద్ధవ్‌పై ఎన్డీయే ఎదురుదాడి..

'అధికార మార్పిడి' వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం

- మిగతా 2లో

- అధికార మార్పిడి కోసమే వచ్చామన్న ఉద్ధవ్ థాకరే
- కాషాయం తమ గుర్తింపు అని, ఎవరూ దొంగిలించలేరని వ్యాఖ్య
- ఉద్ధవ్ వ్యాఖ్యలపై ఎన్డీయే కూటమి నేతల తీవ్ర స్పందన
- థాకరే హిందుత్వంపై ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని బీజేపీ, శివసేన ఆరోపణ
- ఈ వ్యాఖ్యలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని ఎన్డీయే స్పష్టం

'నేనేం ట్రావెల్ ఏజెంట్‌ను కాదు'.. రాహుల్ పర్యటనపై శశిథరూర్

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై వస్తున్న వార్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ ఆసక్తికరంగా స్పందించారు. రాహుల్ పర్యటన

- మిగతా 2లో

వేరే దేశానికి యురేనియం తరలించే ప్రసక్తే లేదు: ఇరాన్

పశ్చిమాసియాలో ఘర్షణలు ముగించేలా అమెరికా - ఇరాన్ మధ్య పాకిస్థాన్ రాయబారం కొనసాగిస్తూనే ఉంది. సంధిపై ముందుకెళ్లే

- మిగతా 2లో

ఎడిటర్ వ్యూ

బెజవాడలో వైసీపీ థర్డ్ ప్లేస్ లోకా ?

విజయవాడ ఏపీలో రాజకీయ గుండె కాయ లాంటిది అన్నది తెలిసిందే. రాజకీయ రాజధానిగా ఈ నగరానికి పేరుంది. ఈనాటి మాట కాదు, వందేళ్ళకు పూర్వం నుంచే ఈ నగరానికి ఆ ఘనత ఉంది. దానికి కారణం అన్ని ప్రాంతాలకు మధ్యన ఉండడం భౌగోళికంగా కీలకమైన అంశం. అలాగే చైతన్యవంతులైన ఓటర్లు ఇక్కడ ఎక్కువగా ఉంటారు. రాజకీయ వేడి కూడా అలాగే ఉంటుంది. బెజవాడలో ప్రధాన సామాజిక వర్గాల ఆధిపత్యం కూడా కొనసాగుతూ వస్తుంది. పార్టీలు కాలాలు రాజకీయాలు వేరు అయినా ఆ సామాజిక వర్గాలు మాత్రం ఎపుడూ ఫోర్ ఫ్రంట్ లోనే ఉంటాయి. రేసులో ఎపుడూ టాప్ చైర్ కోసం దూకుడు చేస్తూనే ఉంటాయి.

రంగంలోకి రాధా :

ఈ నేపథ్యం నుంచి చూసినపుడు బెజవాడ కార్పోరేషన్ రాజకీయం ఇపుడు మచి హీట్ మీద ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలి విడతలో ఈ నెల 28న జరిగే ఎన్నికలలో బెజవాడ మీదనే ఏపీ మొత్తం ఫోకస్ ఉంది. దానికి కారణం ఇక్కడ వంగవీటి రంగా కుమారుడు రాధా దాదాపు 12 ఏళ్ళ తరువాత ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం. ఆయన చివరి సారిగా 2014లో వైసీపీ తరఫున విజయవాడ తూర్పు అసెంబ్లీ సీటుకు పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. ఆ తరువాత 2019, 2024లలో పోటీ చేయలేదు. దాంతో పాటు విజయవాడ నగరం మొత్తాన్ని ప్రభావితం చేసే మేయర్ సీటుకు రాధా ఫోకస్ చేయడం కూడా అతి పెద్ద రాజకీయ చర్చగా ఉంది. ఆయన రాష్ట్ర మంత్రి అవుతారని అంతా ఆశిస్తున్న వేళ మేయర్ గా బరిలోకి దిగడం ఏమిటి అన్నది కూడా అంతా చర్చిస్తున్నారు. అయితే మేయర్ పదవి కూడా మామూలుది కాదు కాబట్టి రాధా డెసిషన్ ఓకే అంటూ మద్దతుదారులు అయితే యమ జోరు మీద ప్రచారం చేస్తున్నారు.

ఏబీవీ ఎంట్రీతో :

రాధా పోటీకి దిగడమే ఒక సర్ ప్రైజ్ అనుకుంటే మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు మేయర్ పదవికి పోటీ పడడం మరో సర్ ప్రైజ్ గా ఉంది. ఏబీవీ రాష్ట్ర స్థాయిలో పేరున్న అధికారి. ఆయన వచ్చే ఎన్నికల్లో ఎంపీగా కానీ ఎమ్మెల్యేగా కానీ పోటీ చేస్తారు అని అంతా అనుకున్నారు. కానీ ఆయన మేయర్ కి పోటీ అంటూ సంచలనం సృష్టించారు. అలాగే ఇండిపెండెంట్ గా అని మరో సర్ ప్రైజ్ ఇచ్చారు. దాంతో ఏబీవీ పోటీ కూడా ఆసక్తిని పెంచుతోంది. ఏబీవీ రాజకీయ నాయకుడు కాదు, కానీ ఆయన పోటీ మీద ఎందుకు అంత ఆసక్తి అంటే ఆయన సీనియర్ మోస్ట్ అధికారిగా పనిచేసిన వారు. ఇక ఆయన పదవిలో ఉండగా ఒక పార్టీ నుంచి రాజకీయ విమర్శలు ఎదుర్కొన్నారు. ఆయన ఇపుడు రేసులోకి దిగడంతో ఆయనకు మద్దతు ఏ వైపు నుంచి వస్తుంది అన్నది కూడా చర్చగానే ఉంది. అయితే ఇక్కడ రాజకీయంతో పాటు సామాజిక సమీకరణలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ముందే చెప్పుకున్నట్లుగా బెజవాడ అనగానే రెండు ప్రధాన సామాజిక వర్గాల ఆధిపత్యం ఎపుడూ ఉంటుంది. అలా ఒక బలమైన సామాజిక పక్షానికి చెందిన ఏబీవీ పోటీకి దిగడంతో ఎవరికి దెబ్బ ఏమిటి అన్నది కూడా చర్చగా ఉంది.

వైసీపీ సంగతేంటి :

ఇక వైసీపీ అయితే కూటమి ఎత్తుకు పై ఎత్తు వేయాలని చూసింది. ఒక దశలో యువ నేత దేవినేని అవినాష్ ని రంగంలోకి దించాలనుకుంది. కానీ అది కుదరలేదు, దాంతో రాయన భాగ్యలక్ష్మిని పోటీకి రెడీ చేసింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ అన్న కార్డుతో వైసీపీ రంగంలో ఉంది. అయితే కూటమి వర్సెస్ వైసీపీ అన్నపుడు ఎంతో కొంత ఓటు వైసీపీకి పడేది. కానీ ఇపుడు ఏబీవీ రంగంలో ఉండడంతో వైసీపీకి మరింత ఇబ్బందికరమైన పరిస్థితి అని అంటున్నారు. గత ఎన్నికల్లో వార్డు కార్పోరేటర్ గా గెలిచి మేయర్ అయ్యారు ఆమె. దాంతో ఆమె నగరం మొత్తానికి మేయర్ గా కొంత వరకూ పరిచయం ఉన్నా రాజకీయ పట్టు ఆ విధంగా లేదని అంటున్నారు. మరో వైపు చూస్తే ఏబీవీ కూడా గెలుపు సంగతి పక్కన పెడితే తనకు భారీగా ఓట్లను దక్కించుకునే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు అని అంటున్నారు. ఒక బలమైన సామాజిక వర్గం దన్నూ మద్దతు కూడా దక్కవచ్చు అన్న చర్చ సైతం సాగుతోంది. ఈ విధంగా సాగే పోరులో వైసీపీ కచ్చితంగా ఇరాకాటంలో పడి మూడవ ప్లేస్ లోకి వెళ్తుందా అన్న చర్చ సాగుతోంది. అదే జరిగితే ఏబీవీ ఓడినా రన్నరప్ గా హిట్ అవుతారు. వైసీపీ రాజకీయ రాజధానిలో చేదు ఫలితాలను అందుకోవాల్సి వస్తుంది. మరి ఆ పరిస్థితి తలెత్తకుండా వైసీపీ ఏ విధమైన చర్యలు తీసుకుంటుంది అన్నదే చూడాల్సి ఉంది.

విజయనగరం కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ తేదీ మార్పు

- మొదటి పేజీ తరువాయి

తీసుకున్నట్లు తెలిపింది. విజయనగరంలో అక్టోబర్ 27న సిరిమాను ఉత్సవం జరగనుంది. ఈ ఉత్సవానికి సుమారు 4 నుంచి 5 లక్షల మంది భక్తులు హాజరవుతారని జిల్లా యంత్రాంగం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో భద్రతా సిబ్బంది కేటాయింపు, ట్రాఫిక్ నియంత్రణ వంటి పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని, అందువల్ల పోలింగ్ తేదీని మార్చాలని జిల్లా కలెక్టర్ ఎస్ఈసీకి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన ఎస్ఈసీ, పోలింగ్‌ను ఒక రోజు వాయిదా వేసింది. కొత్త షెడ్యూల్ ప్రకారం, అక్టోబర్ 29న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు మాత్రం ముందుగా ప్రకటించినట్లే అక్టోబర్ 30న ఉదయం 8 గంటల నుంచి యథాతథంగా కొనసాగుతుంది. ఒకవేళ ఎక్కడైనా రీ-పోలింగ్ అవసరమైతే, దానిని అక్టోబర్ 30న నిర్వహిస్తారు. రీ-పోలింగ్ పూర్తయ్యే వరకు

తుది ఫలితాలు ప్రకటించవద్దని జిల్లా అధికారులకు ఎస్ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇక ఎన్నికల ప్రచార గడువులో ఎలాంటి మార్పు లేదు. ఇతర పట్టణ స్థానిక సంస్థలతో పాటే విజయనగరంలోనూ అక్టోబర్ 26 సాయంత్రం 5 గంటలకు ప్రచారానికి తెరపడనుంది.

మంగళగిరిలో వైసీపీకి షాక్.. లోకేశ్ సమక్షంలో

టీడీపీలో చేరిన కీలక నేత

మంగళగిరి నియోజకవర్గంలో అధికార తెలుగుదేశం పార్టీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, గుంటూరు పార్లమెంట్ వైసీపీ ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్ తన మద్దతుదారులతో కలిసి టీడీపీలో చేరారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు, మరో 25 కుటుంబాలకు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. "2024 సార్వత్రిక ఎన్నికల కంటే స్థానిక ఎన్నికల్లోనే ఎక్కువ మెజార్టీ సాధించాలి. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి. ఎన్డీయే పక్షాన నిలబడటమే మనకు శ్రీరామరక్ష. అప్పుడే మనం అనుకున్న అభివృద్ధి సాధ్యమవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. గత పదేళ్ల పాలనను, తన రెండున్నరేళ్ల పనితీరును బేరీజు వేసుకుని ప్రజలు ఓటు వేయాలని లోకేశ్ కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ, ఆసుపత్రి, కమ్యూనిటీ భవనాలు,

పార్కులు వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అహర్నిశలు పనిచేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎంపీపీ అయిన రజనీకాంత్‌తో పాటు, చిలువూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ యాళ్ల జయలక్ష్మీ, ఇతర టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు

దసరా పండుగ సెలవులు ముగియడంతో నగరవాసులు తిరుగు ప్రయాణం పట్టారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (చీఎ-65) వాహనాలతో కిక్కిరిసిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరడంతో టోల్‌గేట్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ముఖ్యంగా హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాలు బారులు తీరాయి. కొన్ని సమయాల్లో అర కిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. రద్దీని తగ్గించేందుకు అధికారులు హైదరాబాద్ వైపు ఉన్న 18 టోల్ బూత్‌లకు గాను 12 తెరిచి వాహనాలను పంపించారు. ఫాస్టాగ్ విధానం అమలులో ఉన్నప్పటికీ, వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దీనికి తోడు, చిట్యాల, చౌటుప్పల్ వద్ద జరుగుతున్న అండర్‌పాస్, వంతెన నిర్మాణ పనులు కూడా వాహనాల రాకపోకల వేగానికి అడ్డంకిగా మారాయి.

అక్టోబర్ 22 నుంచి పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానుండటంతో కుటుంబసభ్యులు, ఉద్యోగులు ఒకేసారి తిరుగు ప్రయాణం కావడం రద్దీకి ప్రధాన కారణంగా తెలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు టోల్ ప్లాజా సిబ్బందితో పాటు పోలీసులు, హైవే సిబ్బంది రంగంలోకి దిగారు. అదనపు సిబ్బందిని

నియమించి ఫాస్టాగ్ ప్రాసెసింగ్‌ను వేగవంతం చేశారు. కీలక కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఉండి వాహనాలను క్రమబద్ధీకరించారు. చిన్నపాటి జాప్యాలు మినహా ఎటువంటి పెద్ద ప్రమాదాలు జరగలేదని, ట్రాఫిక్ ప్రవాహం నిలకడగా కొనసాగిందని అధికారులు తెలిపారు.

పండుగకు వెళ్లే సమయంలోనూ ఇదే తరహా రద్దీ కనిపించింది. అక్టోబర్ 17న 24 గంటల వ్యవధిలో ఈ టోల్‌ప్లాజా నుంచి సుమారు 52,000 వాహనాలు వెళ్లాయి. అంటే నిమిషానికి సగటున 36 వాహనాలు రహదారిని దాటాయి. రాత్రి వరకు రద్దీ కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రయాణ సమయాన్ని అంచనా వేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉద్ధవ్‌పై ఎన్డీయే ఎదురుదాడి..

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరే చేసిన 'అధికార మార్పిడి', 'కాషాయ గుర్తింపు' వ్యాఖ్యలపై ఎన్డీయే కూటమి నేతలు తీవ్రంగా స్పందించారు. ఆయన మాటలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని, తిరస్కరించడం ఖాయమని స్పష్టం చేశారు. ముంబైలోని చరిత్రాత్మక ఛత్రపతి శివాజీ మహారాజ్ పార్క్‌లో దసరా సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఉద్ధవ్ థాకరే ఈ వ్యాఖ్యలు చేశారు.

అసలేం జరిగింది?

దసరా ర్యాలీలో ఉద్ధవ్ థాకరే మాట్లాడుతూ.. తాము అధికార మార్పిడి కోసమే ఇక్కడకు వచ్చామని ప్రకటించారు. ప్రజా ప్రయోజనాలను విస్మరించిన ఏ ప్రభుత్వాన్నైనా మార్చాల్సిందేనని అన్నారు. "కాషాయం మా గుర్తింపు. దానిని ఎవరూ మా నుంచి దొంగిలించలేరు. ఈ పవిత్ర కాషాయ పతాకాన్ని మహారాష్ట్ర అసెంబ్లీపైనే కాకుండా, ఢిల్లీ పీఠంపై కూడా ఎగరేయాలి" అని ఉద్ఘాటించారు.

ఎన్డీయే నేతల ఘాటు స్పందన

ఉద్ధవ్ థాకరే వ్యాఖ్యలపై ఎన్డీయే నేతలు తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగారు. బీజేపీ ఎమ్మెల్యే రామ్ కదమ్ మాట్లాడుతూ "ఉద్ధవ్ ప్రసంగంలో 'ఆపరేషన్ టైగర్ 3' భయం స్పష్టంగా కనిపించింది. హిందుత్వాన్ని వదిలిపెట్టాననే పశ్చాత్తాపం ఆయన మాటల్లో కొట్టొచ్చినట్లు కనపడింది. అందుకే పదేపదే కాషాయం అనే పదాన్ని, ఛత్రపతి శివాజీ మహారాజ్ పేరును ఉచ్ఛరించారు" అని అన్నారు. సనాతన ధర్మాన్ని కించపరుస్తూ, కాషాయానికి ఉగ్రవాదాన్ని ముడిపెట్టే రాహుల్ గాంధీతో చేతులు కలపడం, అఫ్జల్ గురును కీర్తించే ఉమర్ ఖలీద్ వంటి వారికి మద్దతివ్వడం ఉద్ధవ్ థాకరే ద్వంద్వ వైఖరికి నిదర్శనమని రామ్ కదమ్ విమర్శించారు.

శివసేన అధికార ప్రతినిధి షైనా ఎన్సీ స్పందిస్తూ, "ఉద్ధవ్ 'స్కార్ఫ్ ధరించే' హిందుత్వం వద్దంటున్నారు. కానీ 2019లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నప్పుడు 'టోపీ ధరించే' హిందుత్వాన్ని స్వీకరించారు కదా?" అని ప్రశ్నించారు. "బాలాసాహెబ్ థాకరే గర్వంగా హిందువులమని చెప్పమన్నారు. కానీ ఉద్ధవ్ మాత్రం గర్వంగా అధికార మార్పిడి కోసం పనిచేయాలని చెబుతున్నారు. ఒకరిది నిజమైన హిందుత్వం అయితే, మరొకరిది నకిలీ సెక్యులరిజం" అని ఆమె తెలిపారు.

శివసేన రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవరా మాట్లాడుతూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు, పౌరులకు ఉంటుందని, అయితే ఉద్ధవ్ ఉపయోగించిన భాష ఆమోదయోగ్యం కాదని అన్నారు. "ఫ్రాన్స్, అల్బేనియా, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలతో పరిస్థితులను పోల్చడం ద్వారా అశాంతి, హింసను ప్రేరేపించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని భారత ప్రజలు ఎప్పటికీ అంగీకరించరు. మార్పు తీసుకురావాలనుకుంటే ఎన్నికల ద్వారా, ప్రజల ఓట్లతో రావాలి కానీ ఇలా కాదు" అని ఆయన స్పష్టం చేశారు.

'నేనేం ట్రావెల్ ఏజెంట్‌ను కాదు'..

రాహుల్ పర్యటనపై శశిథరూర్

- మొదటి పేజీ తరువాయి

గురించి మీడియా ప్రశ్నించగా, "నేనేమీ ట్రావెల్ ఏజెంట్‌ను కాదు" అంటూ ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. బుధవారం తిరువనంతపురంలో శశిథరూర్ విలేకరులతో మాట్లాడుతూ "నేను ట్రావెల్ ఏజెంట్‌ను కాదు. ఆ ప్రశ్న నన్ను అడగటంలో అర్థం లేదు. నేను ఢిల్లీ వదిలి ఇక్కడికి ఎందుకు వచ్చాను? ప్రతి వ్యక్తికి కొన్ని బాధ్యతలు ఉంటాయి. కాబట్టి, నేను ఆ విషయంపై వ్యాఖ్యానించలేను" అని స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్)కు వ్యతిరేకంగా ఢిల్లీలో విపక్షాలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లడంపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. రాహుల్ వియత్నాం వెళ్తున్న విమానంలో ఉన్నారంటూ ఒక వీడియోను బీజేపీ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. నిరసనలతో బాగా అలసిపోయినందువల్లే ఆయనకు విశ్రాంతి అవసరమైందని బీజేపీ నేత షానవాజ్ హుస్సేన్ ఎద్దేవా చేశారు. అయితే, రాహుల్ గాంధీ పర్యటనను కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ సమర్థించారు. ప్రధాని సహా ఇతర నేతలు విదేశాలకు వెళ్లడం లేదా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని నిలదీశారు. విదేశాల్లో రాహుల్ విద్యార్థులతో, మేధావులతో సమావేశమవుతారని, ఇంటర్వ్యూలు ఇస్తారని ఆయన గుర్తుచేశారు.

నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి

- మొదటి పేజీ తరువాయి

కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ పథకం అమలులో జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నామని, దీన్ని మరింత మెరుగుపరచాలన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరో తొమ్మిది లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, దీని కోసం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.

ఇసుక సరఫరాలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం సూచించారు. పాలనలో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

- మొదటి పేజీ తరువాయి

ఎస్ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటివరకు అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించవద్దని స్పష్టం చేసింది. అక్టోబర్ 25న తుది జాబితాను విడుదల చేయాలని సూచించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని ఎస్ఈసీ తన ప్రకటనలో తెలియజేసింది.

జగన్ ఒక క్రిమినల్ లిటిగెంట్

- మొదటి పేజీ తరువాయి

ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. కేవలం స్థానిక ఎన్నికలనే కాకుండా, మెగా డీఎస్సీ, అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వందల సంఖ్యలో పిటిషన్లు వేశారని ఆరోపించారు. ఓటరు జాబితా, బీసీ రిజర్వేషన్లపైనా కోర్టులకు వెళ్లి ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారని గుర్తుచేశారు. స్థానిక ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాము మంచి అభ్యర్థులను ఎంపిక చేస్తుంటే, వైసీపీ మాత్రం విధ్వంసకారులను బరిలోకి దించుతోందని ఆరోపించారు. బెంగళూరులో కూర్చొని జగన్ విధ్వంస రచనలు చేస్తున్నారని, ఇతర రాష్ట్రాల నుంచి గుండాలను దించేందుకు కుట్రలు పన్నుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారానికి వారం రోజులే సమయం ఉందని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూనే, వైసీపీ అరాచకాలను, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. వికృత మనస్తత్వం ఉన్నవారిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

వేరే దేశానికి యురేనియం తరలించే ప్రసక్తే లేదు: ఇరాన్

- మొదటి పేజీ తరువాయి

క్రమంలో తమ షరతులను పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు ఇరాన్ స్పష్టంగా చెప్పింది. తాము శుద్ధి చేసిన యురేనియాన్ని వేరే దేశానికి తరలించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. "శుద్ధి చేసిన యురేనియంలో ఒక్క గ్రాము కూడా ఇరాన్ నుంచి బయటకు వెళ్లదు. మాకు నమ్మకం కుదిరేలా అమెరికా చర్యలు తీసుకునే వరకు ఎలాంటి చర్చలు ఉండవు. ఇరాన్ విధించిన అన్ని షరతులను నెరవేర్చడంతోనే ఆ చర్చల ప్రక్రియ ప్రారంభం కావాలి" అని ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహసెన్ రెజాయీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. మధ్యవర్తిత్వం కోసం ఇరాన్ వెళ్లిన జనరల్ మునీర్‌కు మొహసెన్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు.

అప్పటి వరకు హర్మూజ్ మూసే ఉంటుంది..

"హర్మూజ్ జలసంధి విషయంలో ఎలాంటి గందరగోళ వైఖరి లేదు. అమెరికా మా షరతులు అంగీకరించేంత వరకు హర్మూజ్ మూసే ఉంటుంది. ఇప్పటికే వెళ్తున్న మార్గాల్లో ఓడలకు సమస్యలు ఎదురవుతాయి. గత హామీలను అమెరికా గౌరవించేవరకు కొత్తగా చర్చలు ఏమీ ఉండవు" అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ (సూఎమ్ఖుంాతీఘ్రస్త్రప్తుష్టుఉ) ఓ ఇంటర్వ్యూలో పునరుద్ఘాటించారు.

1986 నుంచే నా దగ్గర రివాల్వర్ ఉంది

- మొదటి పేజీ తరువాయి

ఆయన తన తుపాకీకి సంబంధించిన కొన్ని పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. తానున్న ఈ రివాల్వర్‌ను 1986లో సింగపూర్‌లో కేవలం 3 వేల రూపాయలకే కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ ఆయుధాన్ని కేవలం తన ఆత్మరక్షణ కోసమే దగ్గర ఉంచుకున్నానని ఆయన స్పష్టం చేశారు. దీనికి అప్పట్లోనే ఆల్ ఇండియా లైసెన్స్ పర్మిషన్ తీసుకున్నానని, 40 ఏళ్లుగా ఈ రివాల్వర్ తన వద్దే భద్రంగా ఉందని చెప్పారు.

వాయు కాలుష్యం ఎఫెక్ట్.. మళ్లీ ఆంక్షల చట్రంలోకి ఢిల్లీ

- మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలో ఈ నెల 20న వాయు నాణ్యత సూచీ 179గా (మధ్యస్థ కేటగిరీ) నమోదు కాగా.. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు 244 (పూర్ కేటగిరీ)కి ఒక్కసారిగా పెరిగిందని సీఏక్యూఎం ఓ ప్రకటనలో పేర్కొంది. రాబోయే రోజుల్లో వాయు నాణ్యత సూచీ 'పూర్' కేటగిరీలోనే ఉంటుందని భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు అంచనా వేసినట్లు తెలిపింది. వాయు నాణ్యత మరింతగా క్షీణించకుండా నిరోధించేందుకు జీఆర్ఏపీ-1 నిబంధనలను వెంటనే అమలు చేయాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రాప్-1 కింద హోటళ్లు, రెస్టారంట్లలో ఇంధనంగా బొగ్గు, వంట చెరకు వినియోగం నిషేధం, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డీజిల్ జనరేటర్ల వాడకానికి అనుమతించడం వంటి ఆంక్షలను అమలు చేస్తున్నట్లు పేర్కొంది.

రూరల్ మండలం లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21: కార్పొరేషన్ లో విలీనం కాకుండా కోర్టు మినహాయింపు పొందిన రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని స్థానిక పరిషత్ ఎన్నికలకు సంబంధించి కోలమూరు గ్రామ పంచాయితీకి సంబంధించి మండలంలో పదవులకు బుధవారం నామినేషన్ దాఖలు అయ్యాయి. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయంలో వైసిపి నాయకుల నుంచి నామినేషన్లు దాఖలు అయ్యాయి. మండల జడ్పిటిసి పదవికి ఎస్సీ జనరల్ కావడంతో మెల్లిమి గంగరాజు నామినేషన్ వేశారు. ఎంపీటీసీ పదవులకు యామన రమ్యశ్రీ, షేక్ కరీముల్లా, పిల్ల అపర్ణ లు వైసీపీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. వీరికి మాజీ మంత్రి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లా బోయిన వేణుగోపాలకృష్ణ బీఫారాలు అందజేశారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

తాడేపల్లిగూడెంలోని పలు ప్రైవేటు వైద్య,
నిర్ధారణ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 21. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా .రవి బాబు, ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ అధికారుల బృందం తాడేపల్లిగూడెంలోని పలు ప్రైవేటు వైద్య, నిర్ధారణ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారుఈ తనిఖీల్లో భాగంగా తాడేపల్లిగూడెంలోని కావ్యా డయాగ్నోస్టిక్స్ మరియు దొరశ్రీ ఫిజియోథెరపీ క్లినిక్లను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. తనిఖీల ముఖ్య అంశాలు: వైద్య కేంద్రాల రిజిస్ట్రేషన్ మరియు అనుమతి పత్రాల పరిశీలన. ల్యాబ్‌లు, క్లినిక్‌లలో పనిచేస్తున్న సాంకేతిక సిబ్బంది అర్హతలు, నిబంధనల పాటింపు.

రోగులకు అందిస్తున్న సేవల నాణ్యత, స్వచ్ఛత మరియు సురక్షిత ప్రమాణాలు.

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం రికార్డులు నిర్వహిస్తున్నారా లేదా అనే వివరాల తనిఖీ. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా నడిచే క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని, అన్ని రకాల అనుమతులు ఉన్న కేంద్రాలు మాత్రమే సేవలు అందించాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన టెక్నీషియన్లు, నిపుణుల సమక్షంలోనే పరీక్షలు మరియు చికిత్సలు జరగాలని ఆదేశించారు. భవిష్యత్తులో కూడా జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ బృందం తెలిపారు.

జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించాలి

* ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: కలెక్టర్ కె. దినేష్ కుమార్

రంపచోడవరం, (పోలవరం బ్యూరో)పెన్ పవర్, అక్టోబర్ 21: జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రంపచోడవరం జిల్లా పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణను సజావుగా పూర్తి చేయాలని, అభ్యర్థులకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వి రాజ్ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పురుషోత్తం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నాకర రావు, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు, అంకితభావం చిరస్మరణీయం

* ప్రజల రక్షణలో పోలీసుల సేవలు వెలకట్టలేనివి
* పోలవరం జిల్లా ఏర్పాటయ్యాక జిల్లా కేంద్రంలో తొలి పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
* కలెక్టర్ కె. దినేష్ కుమార్

రంపచోడవరం (పోలవరం బ్యూరో), పెన్ పవర్, అక్టోబర్ 21: ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ పోలీసులు చూపుతున్న అంకితభావం అభినందనీయమని కొనియాడారు.

బుధవారం రంపచోడవరం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పోలవరం జిల్లా ఏర్పాటైన తర్వాత జిల్లా కేంద్రంలో తొలిసారిగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సైతం పోలీసు సేవలను విస్తరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. రవాణా సౌకర్యాలు, భౌగోళిక పరిస్థితులు వంటి అనేక సవాళ్లు ఉన్నప్పటికీ ప్రజలకు పోలీసు సేవలు చేరువ చేస్తున్నామని చెప్పారు. గుర్తేడు వంటి మారుమూల ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ఎదురైన పరిస్థితులు ఇందుకు ఉదాహరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేస్తున్న పోలీసుల సేవలను సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి: ఎస్పీ కె. చక్రవర్తి

జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాల సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1960 నుంచి ఈ సంస్మరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారి కుటుంబాలకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. నేరాల నియంత్రణ, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అమరుల త్యాగస్ఫూర్తితో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజలకు మరింత నిబద్ధతతో సేవలందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓఎస్డీ జావళి, డీఎస్పీలు అష్రఫ్ అలీ, సీతారామ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

* ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి.
* జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 21. జిల్లాలో పరిషత్, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలం లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సుమారు 7,500 మంది పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఎన్నికల సిబ్బందిని సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 28న నరసాపురం, ఆకివీడు ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికలు, నవంబర్ 3న పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యరావు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఏ.వి. సూరిబాబు, ఎం ప్రభాకర్, సహాయ రిటర్నింగ్ అధికారి వి. చంద్రశేఖర్, తహసీల్దార్ లు ఎం. సునీల్ కుమార్, రవికుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్ సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముగిసిన విజయదుర్గ శరన్నవరాత్రి వేడుకలు

పూర్ణాహుతి, తెప్పోత్సవం, జ్యోతి దర్శనంతో ఆధ్యాత్మిక శోభ

మహిషాసుర వధ ఘట్టం, బాణాసంచా వరకు కనులపండువగా వేడుకలు

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 21. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో కొలువైన విజయదుర్గ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు బుధవారం భక్తిపారవశ్యంతో ముగిశాయి. ఆఖరి రోజున అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారి వివిధ అలంకరణలు, విశేష పూజలతో ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకున్న ఆలయ ప్రాంగణం ముగింపు వేడుకలతో మరింత పులకించింది. ఉత్సవాలు ప్రారంభమైన దగ్గరి నుంచి పుణ్యక్షేత్రంగా విరాజిల్లిన ఆలయ ప్రాంగణం చివరి రోజున భక్తజన సందోహంతో కళకళలాడింది.

కనులవిందుగా అమ్మవారి తెప్పోత్సవం

మహోత్సవాల ముగింపు సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ నూకల బుల్లియ్య, నూకల ధనకృష్ణ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్ణాహుతి, శమీ పూజ, తెప్పోత్సవం, జ్యోతి దర్శనం, అమ్మవారి ఊరేగింపు భక్తులను మైమరిపించటంతో పాటు పరవశింపజేశాయి. దుష్టశక్తులపై దైవశక్తి విజయానికి ప్రతీకగా నిర్వహించిన మహిషాసుర వధ ఘట్టం భక్తుల్లో భక్తిభావాన్ని నింపింది. అనంతరం జరిగిన బాణసంచా ప్రదర్శన వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు భక్తులు, భవానీలు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. లోకకల్యాణం, సకల జనుల సుఖసంతోషాలు, ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని అమ్మవారిని వేడుకున్నారు. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల మేళవింపుతో సాగిన వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి.

23న భారీ అన్నసమారాధన

అమ్మవారి చల్లని దీవెనలు, కృపాకటాక్షాలు సర్వజనులపై ఉండాలనే సంకల్పంతో ఈ నెల 23న అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని గ్రామ మాజీ సర్పంచ్ నూకల బుల్లియ్య, నూకల ధనకృష్ణ తెలిపారు. భక్తులకు అమ్మవారి అన్నప్రసాదం అందించాలనే ఆధ్యాత్మిక భావనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- మారేడుమిల్లిలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ పరిశీలన
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్

గంగవరం/ మారేడుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 21:ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలవరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ హెచ్చరించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం మారేడుమిల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వీరాజ్ కుమార్ పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ తీరు, అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల అమలును సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

మారేడుమిల్లిలో ఆరు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు

మారేడుమిల్లి మండలంలో మొత్తం ఆరు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో మూడు స్థానాలు ఎస్టీ జనరల్‌కు, మరో మూడు స్థానాలు ఎస్టీ మహిళలకు కేటాయించినట్లు వివరించారు. నామినేషన్ పత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని, అభ్యర్థులకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు.ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైనా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరిగినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఫిర్యాదుల కోసం కలెక్టరేట్ టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 4225, జిల్లా పరిషత్ కార్యాలయ నంబర్ 94411 23704, మారేడుమిల్లి మండల కంట్రోల్ రూమ్ నంబర్లు 94903 40866, 94940 02480 ద్వారా సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి పోలీసు అధికారులకు సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద తగిన భద్రత కల్పించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై నిఘా ఉంచడంతో పాటు, సమస్యాత్మక పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా రెవెన్యూ, పోలీసు, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పరిశీలనలో రిటర్నింగ్ అధికారి ఎస్.కె. దిల్షాద్, సహాయ రిటర్నింగ్ అధికారులు వి.వి. శ్రీనివాసరావు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల నుంచి ఎన్నికల పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్

రంపచోడవరం, (పోలవరం బ్యూరో)పెన్ పవర్, అక్టోబర్ 21:ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు.

బుధవారం రంపచోడవరం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను, ప్రక్రియ నిర్వహణ తీరును సమీక్షించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ పత్రాల స్వీకరణ, పరిశీలనలో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

రంపచోడవరంలో 11 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు

రంపచోడవరం మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. వీటిలో ఐదు స్థానాలు ఎస్టీ జనరల్‌కు, నాలుగు స్థానాలు ఎస్టీ మహిళలకు, ఒక స్థానం అన్‌రిజర్వ్‌డ్ జనరల్‌కు, మరో స్థానం అన్‌రిజర్వ్‌డ్ మహిళకు కేటాయించినట్లు వివరించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చు

ఎన్నికలకు సంబంధించి సమస్యలు ఎదురైనా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరిగినా ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం కలెక్టరేట్ టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 4225, జిల్లా పరిషత్ కార్యాలయ నంబర్ 94411 23704, రంపచోడవరం మండల కంట్రోల్ రూమ్ నంబర్లు 63006 11241, 63051 80978 ద్వారా సమాచారం అందించాలని సూచించారు.ఈ పరిశీలనలో రిటర్నింగ్ అధికారి షేక్ అహ్మద్ షరీఫ్, సహాయ రిటర్నింగ్ అధికారులు పి.వి.వి.ఎస్. ప్రసాద్, సి.హెచ్. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై గోకవరం ఎ.ఎస్పీ దేవరాజ్ పాటిల్ పర్యటన

గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 21:-ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించేందుకు తూర్పుగోదావరి జిల్లా ఎ ఎస్పీ దేవరాజ్ పాటిల్ మంగళవారం గోకవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా గోకవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయం లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను, తంటికొండ చెక్‌పోస్ట్‌ను ఆయన తనిఖీ చేశారు.ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు,స్ట్రాంగ్ రూమ్ భద్రత, చెక్ పోస్ట్ వద్ద చేపడుతున్న తనిఖీలను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు సమాచారం.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, తనిఖీలను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఎ ఎస్పీ దేవరాజ్ పాటిల్ వెంట నార్త్ జోన్ డిఎస్పి జీవన, మండల రిటర్నింగ్ అధికారి ఎంపీడీవో ఎం గోవిందు, కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ మూర్తి, ఎస్సై పవన్ కుమార్ తదితర సిబ్బంది ఉన్నారు.

కూటమిలో "కమ్మ"లాటలు

సీతానగరం ఎంపీపీ పదవిపై "కుమ్ము"లాటలు

సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 21:రాజానగరం నియోజకవర్గంలో కూటమి పార్టీలో ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పిటిసి పదవుల ఎంపికపై తీవ్ర విభేదాలు బయటపడుతున్నాయి. ఈ నియోజకవర్గానికి జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రాతినిధ్యం వహించడం, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా బొడ్డు వెంకటరమణ చౌదరి వ్యవహరించడం కొంతకాలంగా ఆయా పార్టీల్లో సమన్వయం లేకుండా నాయకులు, కార్యకర్తలు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన స్థానిక ఎన్నికలు కూటమి లో విభేదాలు స్పష్టంగా బయట పడుతున్నాయి. నామినేషన్ల పర్వం బుధవారం నుంచి ప్రారంభమైనా ఇంకా అభ్యర్థులను ప్రకటించలేని పరిస్థితిలో తెలుగుదేశం జనసేన కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో ఆయా పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి.

సీతానగరం ఎంపీపీ పదవిపై గుర్రు మంటున్న తెలుగు తమ్ముళ్లు

సీతానగరం మండలంలో 20 ఎంపీటీసీలకు గాను ఏడు స్థానాలు జనసేన, బిజెపి తీసుకున్నాయి. తెలుగుదేశం పార్టీ కేవలం 13 ఎంపీటీసీ స్థానాలు మాత్రమే పోటీ చేసేందుకు సిద్ధమైంది. ఈ సమయంలో ఎంపీపీ పదవి ఇవ్వడం కోసం ఇద్దరు అభ్యర్థులను ఎంపిక చేయటంపై అది కూడా ముందుగా పదవి చేసేవారు రెండేళ్లు, తర్వాత పదవి చేసేవారు మూడేళ్లు ప్రతిపాదనను రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి తీసుకురావడంపై ఆ పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. కోటిన్నరకు పైగా ఖర్చు పెట్టుకుని సగం పదవి, ఎంపీటీసీలతో ఎలా చేస్తామంటూ అంతా మండిపడుతున్నారు. గత కొంతకాలంగా తెలుగుదేశం పార్టీలో నెలకొన్న అసంతృప్తి స్థానిక ఎన్నికల సమయంలో ఒక్కసారిగా బయటపడింది. తెలుగుదేశం పార్టీకి కంచు కోటగా ఉన్న రాజానగరం నియోజకవర్గంలో పార్టీ ప్రభావం తగ్గడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు సీతానగరం జడ్పిటిసి పదవి పై జనసేన పార్టీ అభ్యర్థిని తేల్చకుండా నాన్చటంపై ఆ పార్టీ శ్రేణులకు సైతం మింగుడు పడటం లేదు.

గోల్డెన్ అవర్‌లో బాధితుడికి 108 సిబ్బంది సాయం

సకాలంలో ఆసుపత్రికి తరలింపు.. ప్రాణాలు కాపాడిన అత్యవసర సేవలు

గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 21:పురుగుల మందు తాగిన వ్యక్తికి 108 అత్యవసర వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించారు. అత్యంత కీలకమైన గోల్డెన్ అవర్‌లో వేగంగా స్పందించి వైద్యసాయం అందించడంతో బాధితుడికి సకాలంలో చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు.గంగవరం మండలం టేకుల గ్రామానికి చెందిన బి. వీరస్వామి పొరపాటున గడ్డి మందు తాగినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే వారు 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ చిన్నబ్బులు, పైలట్ ఎస్‌కేబీ నవాజ్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడికి ప్రథమ చికిత్స అందించి, ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.సకాలంలో స్పందించి అత్యవసర వైద్యసేవలు అందించిన 108 సిబ్బందిని బాధితుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని, ప్రమాదాలు లేదా ఇతర వైద్య అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు వెంటనే 108కు సమాచారం అందించాలని సిబ్బంది సూచించారు.

ఉంగుటూరు మండల పరిషత్ ఎన్నికలు.. తొలిరోజు 8 నామినేషన్లు

పెన్ పవర్ ఉంగుటూరు అక్టోబర్ 21:ఉంగుటూరు మండల పరిషత్ ఎన్నికలకు సంబంధించి తొలిరోజు మొత్తం 8 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎస్. రామమోహన్ వెల్లడించారు.రావులపర్రు ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున బోడిగడ్ల శివకుమార్, బోడిగడ్ల వెంకటలక్ష్మి ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. బాదంపూడి ఎంపీటీసీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ తరపున పొరిపిరెడ్డి దేవి, పొరిపిరెడ్డి విజయలక్ష్మి నామినేషన్లు సమర్పించారు. ఉంగుటూరు-2 ఎంపీటీసీ స్థానానికి పిల్ల సత్యవతి, గోపాలపురం స్థానానికి ఆసంట సత్యనారాయణ, కర్లపూడి సుధాకర్ నామినేషన్లు దాఖలు చేశారు. ఉప్పాకపాడు ఎంపీటీసీ స్థానానికి జనసేన పార్టీ తరపున పెద్దిశెట్టి తులసీ వెంకట రమణ నామినేషన్ సమర్పించారు. తొలిరోజు దాఖలైన నామినేషన్లను అధికారులు స్వీకరించారు.

నేడు టీడీపీ, వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు

ఎన్నికల ప్రక్రియలో భాగంగా రెండో రోజైన గురువారం తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఎంపీటీసీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఒకేరోజు అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు వచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై సూర్యభగవాన్ వెల్లడించారు.

ఉంగుటూరు ఎంపీపీ అభ్యర్థిగా అక్కిన నాగమణి

- జడ్పీటీసీ అభ్యర్థిగా చింతల శ్రీనివాస్
- తెదేపా కూటమి అభ్యర్థుల ఖరారు

పెన్ పవర్ ఉంగుటూరు అక్టోబర్ 21:ఉంగుటూరు మండల పరిషత్ అధ్యక్ష, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నికలకు సంబంధించి కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థులను తెలుగుదేశం పార్టీ ఖరారు చేసింది. మంగళవారం సాయంత్రం ఉంగుటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెదేపా మండలాధ్యక్షుడు వేములపల్లి సుధీర్ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు.

ఎంపీపీ అభ్యర్థిగా అక్కిన నాగమణి

ఉంగుటూరు ఎంపీపీ అభ్యర్థిగా నారాయణపురం మాజీ సర్పంచి, తెదేపా సీనియర్ మహిళా నాయకురాలు అక్కిన నాగమణిని ఎంపిక చేశారు. గతంలో ఆమె తెదేపా తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. నారాయణపురం-1 ప్రాదేశిక నియోజకవర్గం నుంచి ఆమె పోటీ చేయనున్నారు.

జడ్పీటీసీ అభ్యర్థిగా చింతల శ్రీనివాస్

ఉంగుటూరు జడ్పీటీసీ అభ్యర్థిగా కైకరానికి చెందిన మాజీ సర్పంచి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ చింతల శ్రీనివాస్ (వాసు)ను ఎంపిక చేశారు. జడ్పీటీసీ స్థానం జనరల్ కేటగిరీకి కేటాయించగా, బీసీ సామాజికవర్గానికి చెందిన వాసుకు అవకాశం కల్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

అభ్యర్థుల ప్రకటనతో ఉంగుటూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి. పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నాయి.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు లూథరన్ హైస్కూల్ విద్యార్థి ముప్పిడి ప్రసాద్

గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 21:- జిల్లాస్థాయి అండర్ 14,, 16 జూనియర్ అథ్లెక్స్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు రాజమహేంద్రవరం లూథరన్ హై స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ డి శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన గోకవరంలోని మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా లూథరన్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ నిడదవోలు ఎమ్మార్ బాలికల కళాశాలలో బుధవారం పోటీలు ఘనంగా నిర్వహించారని ఈ పోటీలలో జాంపేట లూథరన్ హైస్కూల్ విద్యార్థి ముప్పిడి ప్రసాద్ లాంగజంప్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. వచ్చేనెల నవంబర్ 14 నుంచి 16 వరకు హైదరాబాదులో జరిగే జాతీయ పోటీల్లో మన తూర్పుగోదావరి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు బండి ప్రదీప్ వెల్లడించారు. ముప్పిడి ప్రసాద్ ఎంపిక కావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ ఎం. ఐజియా , హెచ్ఎం. ప్రియదర్శిని పిడి డి.శ్రీకాంత్ సువర్ణాలను అభినందించారు.

గోకవరంలో ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ మొదటి రోజు మొదటి రోజు ఏడు నామినేషన్లు.

గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 21:-- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గోకవరం మండలం ప్రజా పరిషత్ కు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది ఈ సందర్భంగా మొదటి రోజు వివిధ గ్రామాల నుండి ఏడు నామినేషన్లు దాఖలు చేయడం జరిగిందని రిటర్నింగ్ అధికారి ఏ నాగ మహేశ్వర రావు తెలిపారు. ఉదయం గం.10.30 నిమిషాలకు గోకవరం మండల ప్రజా పరిషత్ -2026 ఎన్నికలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వారు ఫారం 2 లో నోటీస్ ఆఫ్ ఎలక్షన్ పబ్లికేషన్ చేసారు. అనంతరం రంప ఎర్రం పాలెం -1 ఎంపీటీసీ కన్సిట్యూన్సీ నుండి వైస్సార్సీపీ నుండి అల్లాడి రత్న మాధురి, రంపఎర్రంపాలెం -2 ఎంపీటీసీ కన్సిట్యూన్సీ నుండి వైస్సార్సీపీ పార్టీ అభ్యర్థిగా పాటి నాగమణి, గుమ్మలదొడ్డి ఎంపీటీసీ కన్సిట్యూన్సీ టీడీపీ పార్టీ నుండి పెంతిమేను సింహాచలం, ఇట్టికాయలపల్లి గాదెలపాలెం ఎంపీటీసీ కన్సిట్యూన్సీ వైస్సార్సీపీ పార్టీ దార శ్రీను, కృష్ణుని పాలెం ఎంపీటీసీ కన్సిట్యూన్సీ వైస్సార్సీపీ నుండి గెడ్డం అనందరావు(అనిల్)అచ్యుతాపురం ఎంపీటీసీ కన్సిట్యూన్సీ జనసేన పార్టీ నుండి తళాబత్తుల సుధారాణి, అచ్యుతాపురం ఎంపీటీసీ కన్సిట్యూన్సీ జనసేన పార్టీ నుండి తళాబత్తుల పుష్పలత, మండలం మొత్తం 20 ఎంపీటీసీ స్థానాలకుగాను నామినేషన్లు మొదటి రోజు 7 నామినేషన్లు స్వీకరించబడ్డాయని తెలియజేయుచున్నాము. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి. ఎంపీడీఓ ఎమ్ గోవింద్ తెలిపారు.

దుర్గమ్మకు 108 రకాల వంటకాలతో నైవేద్యం సమర్పణ

చవిటి దిబ్బల భక్తుల ఘనత

వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 21: విజయదశమి సందర్భంగా మండలంలో చవిటి దిబ్బల గ్రామంలో వేంచేసి ఉన్న కనక దుర్గమ్మ కు 108 రకాల వంటకాలతో భక్తులు నైవేద్యం సమర్పించారు. కలిసి కట్టుగా ఉంటే ఏదైనా సాధించగలమనే నానుడి ప్రకారం చవిటి దిబ్బల గ్రామంలో ఉన్న భక్తులు యావన్మంది అత్యంత భక్తి శ్రద్ధలతో 108 రకాల వంటకాలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పలు గ్రామాలను వచ్చిన భక్తులు అమ్మవారికి సమర్పించిన 108 రకాల వంటకాలు చూసి ఆశ్చర్యపోయారు. భక్తుల యొక్క సమిష్టి కృషికి పలువురు అభినందనలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకోలేకపోయినా వండిన వంటకాలు, నైవేద్యం సమర్పించిన తీరును చూసి జన్మ చరితార్థం అయిందని పలువురు అనుకొం టున్నారు.

అంగరంగ వైభవంగా గద్దెలో అమ్మవారి ఊరేగింపు



గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 21:-శ్రీ వీరభద్రుని గద్దెలో వెలసి ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఆర్యవైశ్య సంఘం సభ్యులు కొబ్బరికాయ కొట్టి అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు కార్యక్రమం ప్రారంభించారు. అమ్మవారిని రథం మీద ఊరేగిస్తూ గరగ నృత్యాలు కోలాటం, తీన్మార్ అమ్మవారి వేషధారణతో నవ దుర్గ నృత్యాలు మోడల్ డప్పులతో డిజె డాన్స్ లతో వేషధారణలో మెయిన్ రోడ్డు మీదగా భారీ ఊరేగింపు నిర్వహించారు. డ్రైవర్స్ కాలనీ నుండి మెయిన్ రోడ్డు మీదగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో వీరభద్రుడు గద్దె మీదుగా స్థానిక పంచాయతీ కార్యాలయం వరకు ఊరేగింపు జరిగింది. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసు వారు బందో బస్తు నిర్వహించారు. శుక్రవారం ఆలయ సన్నిధిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు.

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజంలో మార్పు సాధ్యం

మూఢనమ్మకాల నిర్మూలనకు గ్రామస్థాయి నుంచి ఉద్యమించాలి

ఎంఎన్ఎస్ జాతీయ మహాసభల్లో పాల్గొన్న పోలవరం జిల్లా ఉపాధ్యాయుడు కుంజం రాంబాబు దొర

గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 21:సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు గ్రామస్థాయి నుంచి ఉద్యమించాలని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం (ఎంఎన్ఎస్) జాతీయ నాయకులు పిలుపునిచ్చారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. చెన్నైలో అక్టోబర్ 17, 18, 19 తేదీల్లో నిర్వహించిన పెరియార్ స్ఫూర్తి యాత్ర, ఎంఎన్ఎస్ జాతీయ మహాసభల్లో పోలవరం జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు కుంజం రాంబాబు దొర పాల్గొన్నారు. ఈ మహాసభల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం, మూఢనమ్మకాల నిర్మూలనకు పోరాటం చేయడం, పెరియార్, పూలే, అంబేద్కర్ అనుసరించిన ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రజల్లో విస్తరించడం వంటి అంశాలపై చర్చించారు. ఎంఎన్ఎస్ కేంద్ర నాయకులు బైరి నరేష్, గాండ్ల సుజాత మాట్లాడుతూ పిల్లల్లో చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, మూఢనమ్మకాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. సమాజంలో మూఢనమ్మకాలను తొలగించేందుకు సంఘం కార్యకలాపాలను గ్రామస్థాయికి విస్తరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కుంజం రాంబాబు దొర మాట్లాడుతూ పోలవరం జిల్లా ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విద్యార్థులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం తన లక్ష్యమని తెలిపారు. మూఢనమ్మకాల నిర్మూలన, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం పట్ల ఆసక్తి ఉన్న పోలవరం జిల్లా ప్రజలు మూఢనమ్మకాల నిర్మూలన సంఘంలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. ఆసక్తి ఉన్నవారు 94940 02399 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గంగవరంలో తొలిరోజు నామినేషన్లు నిల్



ఏడు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గంగవరం మండలంలో ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. అయితే తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఈశ్వరమ్మ తెలిపారు. మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలోని ఏడు ఎంపీటీసీ స్థానాలకు 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని రిటర్నింగ్ అధికారి తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. గంగవరం ఎస్సై ఎస్. వెంకయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విధులు నిర్వహించగా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. గజేంద్ర కుమార్ నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలను సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, గంగవరం ఎంపీడీవో వై. లక్ష్మణరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్యామలాంబ మున్సిపల్ హైస్కూల్ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

రాజమహేంద్రవరం, పెన్ పవర్ అక్టోబర్ 21:స్థానిక వివిఎల్ పురంలో నిర్మాణంలో ఉన్న శ్రీ శ్యామలాంబ మున్సిపల్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు దాతలు ముందుకు రావడం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా వాతావరణం అంది3ంచేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సి ఎస్ ఆర్ నిధులు సుమారు రూ.75 లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న నూతన భవన నిర్మాణానికి తమ వంతు సహకారంగా శ్రీ భక్తాంజనేయా సురుచి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.3 లక్షల విరాళాన్ని అందించింది. బుధవారం తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ మొత్తాన్ని 11వ డివిజన్ ఇన్‌ఛార్జి కంటిపూడి రాజేంద్ర ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన తరగతి గదులు, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన నూతన భవన నిర్మాణానికి సంస్థ అందించిన విరాళం తోడ్పడనుందన్నారు. . ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొయ్యల రమణ, కొమ్మా శ్రీనివాస్, రఫిక్ రాజా పాల్గొన్నారు

కూటమి జెడ్పిటిసి అభ్యర్థినిగా గొర్లే అమ్మాజీ

వై రామవరం, పెన్ పవర్,అక్టోబర్ 21 : వై రామవరం మండలం జడ్పిటిసి కూటమి అభ్యర్థినిగా గొర్లే అమ్మాజీ ని నియమించడం జరిగిందని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈమె గురువారం రంపచోడవరం లో నామినేషన్ దాఖలు చేయడం జరుగుతుందని కూటమి పార్టీ నాయకులు తెలిపారు. ఈమె మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్ సతీమణి అని తెలిపారు. శ్రీకాంత్ తండ్రి వై. రామవరం సర్పంచ్ గా పనిచేశారన్నారు. రాజకీయంగా మొదటినుండి తెలుగుదేశం పార్టీ పరంగా పనిచేస్తున్నారని అన్నారు. పార్టీలో సుదీర్ఘంగా అనుభవం ఉండడంతో అమ్మాజీని జెడ్ పి టి సి అభ్యర్థినిగా ఎంపిక చేయడం జరిగిందని

వాళ్లు వైసిపి వారే

జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 21; తాటి యా కులగూడెం లో కూటమి నాయకులు కార్యకర్తలు ఎవరు వైసీపీలో చేరలేదని జనసేన గ్రామ అధ్యక్షులు రాయి సుబ్బారావు, మాజీ సర్పంచ్ వనమా రాంబాబు అన్నారు. బుధవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కూటమి నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి కి చెందినవారే మరల వైసీపీలోకి వెళ్లారని వారు అన్నారు. కూటమికి చెందిన వారు ఎవరు వైసీపీలోకి చేరాలేదని అన్నారు. తప్పుడు ప్రచారం తగదని వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు అంతా ఐక్యంగా ఉన్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బండారు అనిల్, కుంజా రమేష్, పద్దం వెంకటకృష్ణ, నేలటూరి మోహన్, మద్దాల రమేష్, చప్పి డి హరికృష్ణ, సొంటి రామకృష్ణ, లక్ష్మణరావు, ప్రసాదు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి

జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 21; నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కూటమి బాలబళాలు, అభ్యర్థుల సామర్థ్యం, ప్రజలలో ఉన్న ఆదరణ గెలుపు అవకాశాలను పరిగణలోకి తీసుకోవాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బుధవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుట్టాయిగూడెం మండలం కొవ్వాడలోని టిడిపి మండల అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు నివాసంలో కూటమి ముఖ్య నాయకులతో సమావేశమై అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసు, టిడిపి ఎన్నికల పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు, కరాటం సాయి, గడ్డమణుగు రవికుమార్ ,పోల్నాటి బాబ్జి, పారేపల్లి రామారావు, శీలం వెంకటేశ్వరరావు, మెట్ట బుచ్చిరాజు, నాయుడు రామకృష్ణ గౌడ్, జయవరపు శ్రీరామ్ మూర్తి, బొల్లిన నిర్మల కిషోర్, చాట్రాతి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 21:పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద బుధవారం ఘనంగా సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తో కలిసి అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి, దేశం కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణే పరమావధిగా విధి నిర్వహణలో ప్రాణత్యాగానికైనా వెనుకాడని పోలీసు అమరవీరుల స్ఫూర్తితో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది కర్తవ్యనిష్ఠతో విధులు నిర్వర్తిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పోలీసు శాఖ గౌరవ ప్రతిష్ఠలను మరింత ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. 1959 అక్టోబర్ 21న లద్దాఖ్ ప్రాంతంలో భారత్--చైనా సరిహద్దు వద్ద విధులు నిర్వహిస్తున్న భారత పోలీసు బలగాలపై చైనా సైనికులు దాడి చేయగా, ఆ ఘటనలో పది మంది భారత పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఎస్పీ గుర్తుచేశారు. వారి అసమాన ధైర్యసాహసాలకు, దేశ రక్షణలో చేసిన ప్రాణత్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తుమని తెలియజేస్తూ ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 11 రోజులపాటు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల ద్వారా పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, వారి సేవా స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబాల సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఆదిత్య శర్మ, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, సెంట్రల్ జోన్ ఏ.ఎస్.పి డాక్టర్ తరుణ్ పహ్వా, ట్రాఫిక్ డిఎస్పి వై.శ్రీకాంత్, సౌత్ జోన్ డిఎస్పి ఏ.శివప్రియ, నార్త్ జోన్ డీఎస్పీ సిహెచ్.జీవన, ఎస్.బి డి.ఎస్.పి బి.రామకృష్ణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఊరేగింపు

శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా పెద్దేరు వాగులో నిమజ్జనం

గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా గంగవరం గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఊరేగింపును బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన భక్తులు, చివరి రోజు అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని అలంకరించి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. గంగవరం గ్రామంతో పాటు పెద్ద అడ్డపల్లి, ఏటిపల్లి, జడేరు గ్రామాల మీదుగా అమ్మవారి ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.అనంతరం పెద్దేరు వాగు వద్ద అమ్మవారిని నిమజ్జనం చేయడంతో శరన్నవరాత్రుల ఉత్సవాలు ముగిశాయి. తొమ్మిది రోజులపాటు అమ్మవారికి పూజలు నిర్వహించి, చివరి రోజు ఊరేగింపులో పాల్గొన్న భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందారు.

జి.ఎం.సి లో అయోడిన్ లోప రుగ్మతల నివారణ పై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్,21: అయోడిన్ లోప రుగ్మతల నివారణలో భాగంగా స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు ఆధ్వర్యంలో అయోడిన్ లోపం, అనారోగ్య సమస్యలు, నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ, అయోడిన్ శరీరానికి అవసరమైన సూక్ష్మపోషక పదార్థమని, థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి కీలకమని తెలిపారు. అయోడిన్ లోపం వల్ల గాయిటర్ (థైరాయిడ్ గ్రంథి వాపు), పిల్లల్లో శారీరక ఎదుగుదల మందగించడం, మేధో వికాస లోపాలు, చదువులో ఏకాగ్రత సమస్యలు తలెత్తవచ్చని వివరించారు. గర్భిణీ స్త్రీలలో అయోడిన్ లోపం పిండం మెదడు అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, గర్భధారణ సమస్యలకు దారితీయవచ్చని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు అయోడిన్ లోపం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ఎన్ టి విభాగాధిపతి డా. వీరకుమార్ మాట్లాడుతూ, అయోడిన్ లోప రుగ్మతలను నివారించడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, అయోడిన్ కలిగిన ఉప్పు వినియోగాన్ని ప్రోత్సహించడం జాతీయ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాలని తెలిపారు. సముద్ర ఆహారాలు, పాలు, గుడ్లు వంటి ఆహార పదార్థాలు అయోడిన్‌ను అందించగలవని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. కె.వి. శివప్రసాద్ మాట్లాడుతూ, శరీరానికి అయోడిన్ అందేలా సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భధారణ ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి డా. రమేష్ బాబు మాట్లాడుతూ, చేపలు సముద్ర ఆహారాలలో అయోడిన్ సమృద్ధిగా లభిస్తుందని తెలిపారు.

అసోసియేట్ ప్రొఫెసర్ డా. శివకుమార్ మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థులకు అయోడిన్ ప్రాముఖ్యత, లోప లక్షణాలు, అయోడిన్ ఉప్పు వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. .నేత్ర వైద్య విభాగాధిపతి డా. భరత్ జైన్ మాట్లాడుతూ, మహిళలు, గర్భిణీలు, పిల్లలలో పోషకాహార లోపాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్ డా. అరుణ మాట్లాడుతూ, స్థానిక ఆహారపు అలవాట్లు, పోషకాహార లభ్యతను దృష్టిలో ఉంచుకొని అయోడిన్ ఉప్పును వినియోగించడం ముఖ్యమని వివరించారు.

ఈ కార్యక్రమంలో డా. మేరీ ఇందిరా, అధ్యాపకులు, పీజీ వైద్య విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో కార్పోరేషన్ కు ఎన్నికలు

రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:నగర శివారు పంచాయతీ లు విలీనం పూర్తి కావడంతో మహ రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియ పూరైందని

కార్పోరేషన్ కు త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆయన స్వగృహం లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల న్నింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. పుష్కరాల దృష్ట్యా నగరం లో శాశ్వత అభివృద్ధి పనులు చేస్తున్నామ న్నారు.పని చేసే ప్రభుత్వం కావాలా ఐదేళ్లుగా పని చేయని నేతలు కావాలా ప్రజలు ఆలోచించా లన్నారు. ప్రస్తుత ఎస్ ఈసీ ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నారని,

కోర్టులు చివాట్లు పెట్టినా సిగ్గు లేకుండా జగన్ మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో ఓడి పోతామని నామినేషన్లు వేయకుండా వైసీపీ నాయకులు పారి పోతున్నారన్నారు.గతంలో తమకు నామినేషన్లు వేయకుండా ఆటంకాలు కల్పించారని అన్నారు. గతంలో ఎస్ ఈసీ నిమ్మగడ్డ రమేష్ ను పనిచేయకుండా ఆఫీస్ కు తాళాలు వేయించా రన్నారు. పులివెందుల లో 14 సీట్లు ఏకగ్రీవ అయ్యాయంటే జగన్ పరిస్థితి అర్థం చేసుకోవాలని అన్నారు.

జగనన్న కాలనీల్లో చేసిన దగా వల్ల హౌసింగ్ లో వెనక పడాల్సి వస్తోందన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుండా పేదలకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం ఆపేసిందన్నారు.

వెయ్యి కోట్లతో కట్టిన కాపర్ డ్యాం జగన్ నిర్లక్ష్యం వల్ల ధ్వంసమైందన్నారు .

ఈ సమావేశంలో నియోజ కవర్గ పరిశీలకులు కే.శ్రీని వాస్ యాదవ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, యమన నారాయణ గౌడ్, పందురి అప్పారావు, కడియం మండల జనసేన అధ్యక్షులు ముద్రగడ జెమ్మి, రూరల్ మండల జనసేన అధ్యక్షులు చప్పా చిన్నరావు, తలారి మూర్తి తదితరులు ఉన్నారు

ఉంగుటూరు మండలంలో 23 ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థుల ఖరారు!

పెన్ పవర్ ఉంగుటూరు అక్టోబర్ 21 ఉంగుటూరు మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితా వెల్లడైంది. మండలంలోని వివిధ గ్రామాలు, ప్రాదేశిక నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి.

ఎంపీటీసీ అభ్యర్థుల జాబితా:

వెల్లమిల్లి--1: రాపోలు పెద్దిరాజు వెల్లమిల్లి--2: కొక్కిరిపాటి మణిరత్నం బాదంపూడి: కె.వి.ఎం. భాగ్యలక్ష్మి ఉప్పాకపాడు: నేదూరి ధనలక్ష్మి, గోపిశెట్టి అలివేలు మంగతాయారు బొమ్మిడి: యాతం నారాయణరావు నాచుగుంట: కాగిత సత్యనారాయణ, నెర్సు పుల్లయ్య రావులపర్రు: బోడిగడ్ల శివకుమార్ ఉంగుటూరు--1: రామేన వెంకట సాయిలక్ష్మి ఉంగుటూరు--2: సందక దేవి నారాయణపురం--1: కిలపర్తి లక్ష్మి నారాయణపురం--2: కొడమంచిలి రోజా పుష్పం కైకరం--1: తాండ్ర శ్రావణి

కైకరం--2: నడిమింటి శ్రీను

కైకరం--3: బలే దుర్గ

ఎ. గోకవరం: మిద్దే వెంకటేశ్వరరావు

గోపీనాథపట్నం: పుత్సకాయల శాంబవి

గోపాలపురం: బిక్కిన పవన్‌కుమార్

కాకర్లమూడి: కంచర్ల సలోమి

గొల్లగూడెం: దాసరి పద్మావతి

నీలాద్రిపురం: చదవలవాడ కిషోర్‌బాబు రాచూరు: గొట్టాపు శాంతకుమారి చేబ్రోలు--1: గుడ్ల శ్రీనివాసరావు చేబ్రోలు--2: ఆకుల మణికంఠ (రాజా)మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థుల పేర్లు వెల్లడికావడంతో ఆయా గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. అభ్యర్థులు ప్రజల మద్దతు కూడగట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ఫారం-II నోటీస్ ప్రచురణ

వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 21: మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఫారం-II నోటీస్ ప్రచురణ చేయడం జరిగిందని రిటర్నింగ్ ఆఫీసర్ బి నరేంద్ర కుమార్ తెలిపారు. వై రామవరం మండలంలో నాలుగు ఎంపీటీసీ స్థానాలకు జరిగే ఎన్నికలకు గురువారం నుండి నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఆయన తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎస్పీ డి.నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 21:తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత జిల్లా వ్యాప్తంగా జడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ కేంద్రమైన హుకుంపేటలోని జిల్లా గ్రామీణ మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను, నామినేషన్ల ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ కేంద్రాలైన రాజానగరం, రంగంపేట ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి, నామినేషన్ల ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడి భద్రతా ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా అభ్యర్థులు, వారి అనుచరుల రాకపోకలను నిరంతరం పర్యవేక్షిస్తూ, నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ పాటిల్ దేవరాజ్ మనీష్, సెంట్రల్ జోన్ ఏఎస్పి డాక్టర్ తరుణ్ పహ్వా, ట్రాఫిక్ డీఎస్పీ వై.శ్రీకాంత్, సౌత్ జోన్ డిఎస్పి ఏ.శివప్రియ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాసరావు, రాజానగరం ఇన్స్పెక్టర్ ప్రసన్న వీరయ్య గౌడ్, బొమ్మూరు ఇన్స్పెక్టర్ పి.కాశీ విశ్వనాథం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 21ను వాస్తవ స్వాతంత్ర్య దినోత్సవంగా ప్రకటించాలి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ త్యాగాలకు దేశ పాలకులు తగిన గుర్తింపు కల్పించాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేసారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్య పోరాటాన్ని స్మరించుకున్నారు. 1943 అక్టోబర్ 21న నేతాజీ ఆధ్వర్యంలో ఆజాద్ హింద్ ప్రభుత్వం ఏర్పాటైన చారిత్రక ఘట్టానికి దేశ చరిత్రలో సముచిత స్థానం కల్పించాలని మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ చేసిన పోరాటం, ఆయన చేసిన త్యాగాలు, ఆజాద్ హింద్ ప్రభుత్వ చారిత్రక ప్రాధాన్యతను నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబర్ 21వ తేదీని దేశ స్వాతంత్ర్య చరిత్రలో వాస్తవ దినంగా అధికారికంగా గుర్తించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై పార్లమెంటులో చట్టపరమైన నిర్ణయం తీసుకుని, నేతాజీ సేవలకు తగిన గౌరవం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం పాలకుల బాధ్యతని, నేతాజీ సుభాష్ చంద్రబోస్ త్యాగాలు యువతకు స్ఫూర్తిగా నిలవాలని జాతీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

మండల పరిషత్ అధ్యక్ష అభ్యర్థినిగా కూటమి తరపున పుల్లా రామలక్ష్మి నామినేషన్ దాఖలు

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 21.పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం మండల పరిషత్ అధ్యక్ష అభ్యర్థినిగా కూటమి తరపున జనసేన పార్టీ పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబి సతీమణి రామలక్ష్మి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. అలంపురం ఎంపీటీసీ 2 స్థానం నుండి ఆమె పోటీ చేయనున్నారు. కూటమి నాయకుల సమక్షంలో కోలాహలంగా నామినేషన్ కార్యక్రమం జరిగింది. జనసేన తెలుగుదేశం భారతీయ జనతా పార్టీల నుండి నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యా రు. ఈ సందర్భంగా పుల్లా బాబి మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు ఎంపీపీ గా అవకాశం కల్పించినప్పటికీ తన స్వగ్రామంలో అవకాశం లేకపోవడంతో అలంపురం గ్రామ ప్రజలు ఇచ్చిన హామీతో అలంపురం నుండి ఎంపీటీసీగా పోటీ చేయడం జరుగుతుందన్నారు. తమకు అవకాశం ఇస్తే నియోజకవర్గంలోనే ఏ గ్రామంలోనూ జరగనంత అభివృద్ధి అలంపురం గ్రామంలో చేసి చూపిస్తామని చెప్పారు. అనుక్షణం అభివృద్ధి కోసం పరితపించే స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సహకారంతో ఇప్పటికే పలు గ్రామాల్లో కోట్లాది రూపాయల అభివృద్ధి జరిగిందని రానున్న రోజుల్లో అలంపురం గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామన్నారు. పెంటపాడు మండల జడ్పిటిసి అభ్యర్థిగా అలంపురం గ్రామం నుండి తణుబుద్ధి రవి కిరణ్ ను కూడా గ్లాసు గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తమను అక్కున చేర్చుకున్న అలంపురం గ్రామ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. విద్యావేత్త తన బుద్ధి భోగేశ్వర రావు మాట్లాడుతూ మండలంలోని అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అలంపురం గ్రామం నుంచి ఎంపీపీగా జడ్పిటిసిగా అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా గ్రామ ప్రజలందరూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో తోట రాజా, జడ్పిటిసి కూటమి అభ్యర్థి తణుబుద్ధిరవి కిరణ్, కసిరెడ్డి మధులత, కట్టు బోయిన కృష్ణ ప్రసాద్, మైలవరపు పెద్దబాబు, సజ్జ సుబ్బు, కొనగల హరినాథ్,ముత్యాల శ్రీనివాసరావు, పారిచర్ల ప్రసాద్, పెనుమర్తి శ్రీనివాసరావు (నారాయణరావు) పాలూరి గోపాల్, చెరుకూరి సోమశేఖర్, చీర్ల అంజిరెడ్డి, ద్వార బంధం సురేష్, కోడే కాళీ, కూటమి నాయకులు పాల్గొన్నారు

తాళ్లపూడి మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

తాళ్లపూడి, పెన్ పవర్, అక్టోబర్ 21:తూర్పుగోదావరి జిల్లాలోని తాళ్లపూడి మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలకు బుధవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు మండల పరిషత్ కార్యాలయానికి తరలివచ్చారు.

నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా చేపట్టారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టారు.

అభ్యర్థులకు నామినేషన్ పత్రాల దాఖలుకు సంబంధించి అవసరమైన సూచనలు, సలహాలు అందించేందుకు మూడు చోట్ల ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జయరామలక్ష్మి సూచించారు. బుధవారం 11 నామినేషన్లు రాగా టీడీపీకి 5, వైఎస్సార్సీపీకి 6 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అమ్మిరాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ద

గుర్తేడులో తొలిరోజు నామినేషన్ లు నిల్



వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్, అక్టోబర్ 21 : గుర్తేడు మండలంలో తొలిరోజు బుధవారం ఎంపీటీసీ ఎన్నికలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎంపీడీవో శిరీష రాజు తెలిపారు. బుధవారం ఉదయం ఫారం -1 నోటీసు ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. మండలంలో నాలుగు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నట్లు ఉందని అన్నారు. తొలి రోజు ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదని తెలిపారు.

కొవ్వూరు మండలంలో 13 ఎంపీటీసీ నామినేషన్లు స్వీకరణ

కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 21:ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి బుధవారం కొవ్వూరు మండలంలో మొత్తం 13 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి ఎం.వి.ఆర్.సాయిబాబా తెలిపారు. మండలంలో మొత్తం 20 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.పార్టీల వారీగా అందిన నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. జనసేన పార్టీ నుంచి 2, తెలుగుదేశం పార్టీ నుంచి 2, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 7, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 2 నామినేషన్లు దాఖలయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సిహెచ్.ఎన్. వెంకటరెడ్డి, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్ సీపీ సమరశంఖం..

ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులకు బీఫారాలు అందజేసిన వడ్డి రఘురామ్ నాయుడు



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 21:పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. 2026 స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో రాజకీయ ఉత్సాహం కనిపించింది. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు చెందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు పార్టీ కార్యాలయంలో అభ్యర్థులకు బీఫారాలు అందజేశారు. పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు బీఫారాలు అందించి, ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు చెందిన పలువురు ఎంపీటీసీ అభ్యర్థులు వడ్డి రఘురామ్ నాయుడు చేతుల మీదుగా బీఫారాలు అందుకున్నారు. అనంతరం ఆయా మండలాల ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లి తమ నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలి రోజే అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఇక జెడ్పీటీసీ అభ్యర్థుల విషయానికొస్తే.. తాడేపల్లిగూడెం జెడ్పీటీసీ అభ్యర్థిగా ఆరుగొలను గ్రామానికి చెందిన సత్తిరాజు చిన్నమ్మ, పెంటపాడు జెడ్పీటీసీ అభ్యర్థిగా పెంటపాడు గ్రామానికి చెందిన నల్లిమిల్లి అంజిరెడ్డి వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. వీరిద్దరికీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు పార్టీ బీఫారాలను అందజేశారు. బీఫారాలు అందుకున్న సత్తిరాజు చిన్నమ్మ, నల్లిమిల్లి అంజిరెడ్డి ఈరోజు జిల్లా కేంద్రం భీమవరంలో తమ నామినేషన్లను దాఖలు చేశారు. దీంతో తాడేపల్లిగూడెం, పెంటపాడు ప్రాంతాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందడి మొదలైంది. గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుంటూ సేవలందించాలనే లక్ష్యంతో అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలుస్తున్నారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పరిపాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజల కష్టాలను పరిష్కరించాల్సిన నాయకులు ప్రజలను మరచిపోయి, తమ జేబులు నింపుకునే పనిలో నిమగ్నమయ్యారని విమర్శించారు. కల్లబొల్లి మాటలు చెబుతూ, అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాల్సిన ప్రభుత్వం.. ప్రజల సమస్యలను పక్కనపెట్టడం సరికాదని వ్యాఖ్యానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వాములయ్యే నాయకులను స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి నిలుపుతున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కృషి చేసే నాయకులు స్థానిక సంస్థల్లో ఉండటం ఎంతో అవసరమని వడ్డి రఘురామ్ నాయుడు పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం, ప్రజల పట్ల బాధ్యత కలిగిన అభ్యర్థులకే వైఎస్సార్ సీపీ ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారని, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న నాయకులని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన.. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ప్రజలు ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో పార్టీ అభ్యర్థులు విజయాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామాల అభివృద్ధికి కృషి చేయడమే తమ అభ్యర్థుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్థానిక సంస్థల్లో ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, ప్రజలకు అండగా నిలిచే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఈ ఎన్నికల్లో ప్రజలు మద్దతు తెలుపుతారని వడ్డి రఘురామ్ నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. మొత్తంగా తాడేపల్లిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బీఫారాల పంపిణీతో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైంది. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, జెడ్పీటీసీ అభ్యర్థులు సత్తిరాజు చిన్నమ్మ, నల్లిమిల్లి అంజిరెడ్డి భీమవరంలో నామినేషన్లు సమర్పించారు. కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వడ్డి రఘురామ్ నాయుడు ప్రకటించారు.

చిరుప్రాయంలోనే అద్భుత ప్రజ్ఞ.

నవరాత్రులలో అమ్మవారి నవరూపాలను కళ్లకు కట్టిన ఐదో తరగతి విద్యార్థిని శివాని
గండేపల్లి మండలంలో విశేష ప్రశంసలు అందుకుంటున్న చిన్నారి చిత్రకళా ప్రతిభ

గండేపల్లి పెన్ పవర్, అక్టోబర్, 21: దేవీ నవరాత్రుల పవిత్ర వేళ.. ఆ జగన్మాత దివ్య రూపాలను తన లేలేత చేతులతో కాగితంపై ఆవిష్కరించి అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది ఓ చిన్నారి. గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వల్లభశెట్టి శివాని తన సృజనాత్మకతకు పదునుపెట్టి, అమ్మవారి తొమ్మిది అవతారాలను అద్భుతమైన చిత్రలేఖనాలుగా మలిచింది. ?ఎ్రవరం శ్రీ సూర్య పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న శివాని.. నవరాత్రులు ప్రారంభమైన నాటి నుంచి ప్రతిరోజూ ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి విభిన్న రూపాలను అద్భుతంగా చిత్రీకరించింది. శ్రీ బాలా త్రిపుర సుందరి, గాయత్రీ దేవి, అన్నపూర్ణా దేవి, మహా చండి, లలితా త్రిపుర సుందరి, సరస్వతి దేవి, మహాలక్ష్మి, కనకదుర్గ మాత తదితర తొమ్మిది రూపాలను తూచా తప్పకుండా, కన్నులపండువగా గీసి చూపరులను ఆకట్టుకుంది. ?చిన్న వయసులోనే అమ్మవారిపై ఉన్న భక్తిని, చిత్రలేఖనంపై తనకున్న మక్కువను చాటుకున్న శివాని ప్రతిభ సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. చిన్నారి ప్రతిభను గుర్తించి అభినందించిన శ్రీ సూర్య పాఠశాల కరస్పాండెంట్ వీరబాబు, ఉపాధ్యాయ బృందం ఆమెను ప్రత్యేకంగా సత్కరించి ప్రోత్సహించారు. తోటి విద్యార్థులు సైతం శివానిని అభినందించారు. భవిష్యత్తులో శివాని చిత్రలేఖన రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరెన్నో అద్భుతమైన చిత్రాలు గీయాలని గ్రామస్థులు, శ్రేయోభిలాషులు మనసారా ఆకాంక్షించారు.

ర్యాలీలో 'మీ సంకల్పం.. మా సేవ' నూతన సేవా కార్యక్రమం ప్రారంభం

విజయదశమి సందర్భంగా వలస కూలీలకు దుప్పట్ల పంపిణీ, అన్నదానం

ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 21: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలీలో అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మీ సంకల్పం.. మా సేవ' పేరుతో నూతన సేవా కార్యక్రమాన్ని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మోహిత్ కృష్ణ ప్రారంభించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన శ్రీశక్తి గ్రూప్ అధినేత డీవీ మనోహర్ పుట్టినరోజు సందర్భంగా ఆయన సంకల్పంతో వలస కూలీలకు దుప్పట్ల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మోహిత్ కృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు అండగా నిలవాలనే లక్ష్యంతో 'మీ సంకల్పం.. మా సేవ' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పేదలకు విద్య, వైద్యం, ఆహారం వంటి కనీస అవసరాలను ఉచితంగా అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి, అవసరంలో ఉన్నవారికి సహాయం అందిస్తామని తెలిపారు.పండుగ వేళ వలస కూలీలకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించడం ద్వారా మానవతా విలువలను చాటారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ చేపట్టిన ఈ కార్యక్రమం సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది.

వాడపల్లి వెంకన్నకు రూ.1,01,115 విరాళం

స్వామివారి అష్టోత్తర పూజలు పాల్గొన భక్తులు

ఆత్రేయపురం పెన్ పవర్, అక్టోబర్ 21:కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. బుధవారం స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆలయ సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయంలో నిత్యం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు భక్తులు విరాళాలు సమర్పిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.ఈ క్రమంలో సామర్లకోట, నిమ్మతోటకు చెందిన నల్లమిల్లి కరుణకుమారి, ఆమె కుటుంబ సభ్యులు ఆలయ అన్నప్రసాద కార్యక్రమానికి రూ. 1,01,115 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో దాతలకు ఆశీర్వచనం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని వారికి బహూకరించారు.

'తిరుపతి' మేయర్ పీఠం అంత ఈజీకాదా ..!

హైదరాబాద్ పెన్ పవర్: తిరుమల శ్రీవారు కొలువైన తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలు హాట్ హాట్‌గా సాగనున్నాయా? ఓటు బ్యాంకు వ్యవహారం ఇక్కడ కీలకంగా మారనుందా? అంటే.. తాజాగా మారుతున్న పరిణామాలను గమనిస్తే.. ఔననే సమాధా నమే వినిపిస్తోంది. దీనికి కారణం.. సీమ ప్రాంతంలోని కార్పొరేషన్లలో ఎక్కడా లేని విధంగా తిరుపతి కార్పొరేషన్‌లో నే పోటీ తీవ్రంగా ఉంది. మొత్తం 12 మంది మేయర్ పీఠం కోసం పోటీలో ఉన్నారు. వీరిలోనూ ప్రధానంగా వైసీపీ అభ్యర్థి నామినేషన్ సక్సెస్ అయింది.దీంతో కూటమి పార్టీల తరఫున పోటీలో ఉన్న అభ్యర్థి గెలుపు ఇప్పుడు నల్లేరుపై నడక అయితే కాదన్న అభిప్రా యం వ్యక్తమవుతోంది. వాస్తవానికి ఇతర ప్రాంతాల్లో చాలా వరకు వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అధికారులు పలు కారణాలతో తిరస్కరించారు. కానీ, తిరుపతి విషయానికి వస్తే.. వాసుదేవ్ యాదవ్ నామినేషన్ ను అనుమతించారు. చిన్నపాటి వివాదాలు తలెత్తినా.. అధికారులు సర్దుకుపోయారు. ఇక, ఈ సీటును కూటమి పార్టీల్లో టీడీపీకి కేటాయిం చారు. ఈ పార్టీ తరఫున మన్నెం శ్రీనివాస ప్రసాద్ బరిలోకి దిగారు. ఈయన కాకుండా.. కమ్యూనిస్టులు బలపరిచిన అభ్యర్థి సహా.. స్వతంత్ర అభ్యర్థులు.. మొత్తంగా 12 మంది మేయర్ కోసం పోటీపడుతున్నారు. ఇక, నామినేషన్లు అన్నీ అధికారుల ఆమోదం పొందిన నేపథ్యంలో ఉపసంహరణ వ్యవ హారం పెద్దగా కలిసి వచ్చేలా కనిపించడం లేదు. దీంతో కీలకమైన స్థానంలో పోటీ ఖాయమని తెలుస్తోంది. కూటమి పార్టీల ఐక్యతతో పాటు తిరుపతి ఎంపీ, వైసీపీ నాయకుడు గురుమూర్తి సహా భూమన కరుణాకర్ రెడ్డి వంటి సీనియ ర్లకు కూడా ఈ ఎన్నిక బిగ్ టెస్టుగానే మారనుంది.

స్థానికంపై పట్టు..

భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబానికి తిరుపతి స్థానిక ఎన్నికల వ్యవహారంపై మంచి పట్టుంది. గతంలో విజయం దక్కించుకున్న అనుభవంతోపాటు.. సానుభూతి కూడా ఉన్న నేపథ్యంలో ఆయన ప్రచారం.. వైసీపీ అభ్యర్థికి కలిసి రానుందన్న అంచనాలు ఉన్నాయి. ఇక, కూటమిలో సఖ్యత ఇక్కడ కీలకంగా మారనుంది. అదేసమయంలో తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో ఇటీవల తలెత్తిన కొన్ని వివాదాలు కూడా ఇక్కడ ఎన్నికల్లో ప్రచార అస్త్రాలుగా మారనున్నాయి. దీనికితోడు.. ఇండిపెండెంటు అభ్యర్థులు ఏమేరకు ఓటు బ్యాంకును ప్రభావితం చేస్తారన్న విషయంపై కూడా ఎన్నికల్లో విజయం ఆధారపడి ఉంటుందన్న చర్చ సాగుతోంది. ఏదేమైనా తిరుపతి స్థానం ఇప్పుడు వైసీపీ, టీడీపీలకు ప్రతిష్టాత్మకంగా మారిందనే చెప్పాలి.

జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా

పులివెందుల,అక్టోబరు 21 పెన్ పవర్:
స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే టీడీపీ, వైసీపీలు రెండూ ఒకే బాట పయనిస్తున్నాయి. అరాచకాలలో ఒకరిని మించి మరొకరు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ పాలనపై విమర్శలు చేసే చంద్రబాబు నేడు జరుగుతున్న పరిస్థితులను అవతలి వారిపైకి నెట్టడం సమర్థనీయం కాదు. ఎన్నికలంటే శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదు. ఇప్పుడు జరుగుతున్న, జరిగిన పరిణామాలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా చేష్టలుడిగి చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఇంత ఉదాసీన వైఖరి కారణంగా ఆంధ్రప్రదేశ్ లో ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఇవే పరిస్థితులు తలెత్తక మానవన్న కామెంట్స్ రాజకీయ విశ్లేషకులు కూడా చేస్తున్నారు.రాజకీయాలు చూడండి. అయితే ఇప్పుడు ఏపీలో మాత్రం అధికార పార్టీది, విపక్ష పార్టీది ఒకే దారి అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు వైసీపీ బాధిత పార్టీగా కనిపించవచ్చు. కానీ అదే తమ పాలనలో జగన్ ప్రభుత్వం అవలంబించిన చర్యలేవిటి? అని చంద్రబాబు ప్రశ్న కూడా అందరూ ఆలోచించాల్సిన విషయమే. అలాగే ఇదే విమర్శ రేపు చంద్రబాబు కూడా ఎదుర్కొనే పరిస్థితులు రావచ్చు. నాడు కుప్పం నియోజకవర్గంలో జగన్ చేసిన పని, నేడు పులివెందులలో టీడీపీ చేసింది. ఇందులో తప్పు వెతుక్కోవడానికి ఇద్దరిలోనూ వెతికినా కనిపించవు. కానీ జనం మాత్రం వీటిని గమనిస్తూనే ఉంటారన్న విషయాన్ని మాత్రం వైసీపీ, టీడీపీలు మర్చి పోకూడదు. ప్రజాస్వామ్యం మనుగడ కొనసాగించాలంటే రెండు పార్టీల అధినేతలు ఎవరికి వారే ఆత్మవిమర్శలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ, వైసీపీ లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కూటమి పార్టీకి అత్యధిక స్థానాల్లో గెలుపు సాధించుకోవాలని సహజంగానే భావిస్తుంది. అదే సమయంలో వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత బలోపేతం అయితే రానున్న సాధారణ ఎన్నికలకు పుంజుకుంటామని భావన కారణంగానే ఈ రకమైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నది కాదనలేని వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అందులో తప్పులేదు. కానీ హింసా రాజకీయాలకు స్వస్తి పలకాలి. అనుభవమున్నచంద్రబాబు కు ఇది ఎంత మాత్రం అభిలషణీయం కాదు. ఒకరకంగా జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా? అన్న అనుమానం కూడా చాలా మంది సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ నామినేషన్ల సందర్భంగానే చూశాం. ఇక జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో ఇంకెంత రగడ చూడాలో.. .దేవుడా ఏపీకి నీవే దిక్కు. అని అనుకోవడం తప్ప చేసేదేమీ లేదు

వ్యూహాలు ప్రతివ్యూహాలతో

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాచికలు పారినట్లు కనపడుతుందివైఎస్ మోహన్ రెడ్డి వ్యూహాలు ప్రతివ్యూహాలతో సర్వసన్నద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేందుకు ఆయన వేస్తున్న అడుగులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంది. దీంతో తాడిపత్రి మున్సిపాలిటీ తప్పించి అన్నింటా వైసీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు టీడీపీ పాలనపై వ్యతిరేకత తెచ్చేందుకు, తమ పార్టీపై సానుభూతి కురిసేందుకు జగన్ వేసిన వ్యూహం సక్సెస్ అయినట్లే కనపడుతుంది. ప్రతి చోట ఖచ్చితంగా నామినేషన్లు వేయాలని, ఏకగ్రీవం జరిగితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇవ్వనని జగన్ నాడు చేసిన హెచ్చరికలను వేరే విధంగా చూసిన వారికి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతుంది. జగన్ తన ఎత్తుగడలో భాగంగనే నామినేషన్లు వేయించి అభ్యర్థులను బరిలోకి దిగితే శాంతిభద్రతలు అదుపు తప్పి టీడీపీ పాలనపై వ్యతిరేకత ఏర్పడుతుందని అంచనా నిజమవుతుంది. గత రెండు రోజులుగా జరుగుతున్న నామినేషన్ల పర్వం చూస్తేనే ఇది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.మ్యాప్‌లు చూడండి ప్రతి సీటులోనూ పోటీకి... గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను పునరావృతం కానివ్వకుండా, ఈసారి ప్రతి స్థానంలోనూ వైసీపీ అభ్యర్థిని పోటీకి నిలపాలని జగన్ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా అధికార కూటమికి ఏకగ్రీవాలు చేసుకునే అవకాశం ఇవ్వకూడదని, ఒకవేళ ఏదైనా నియోజకవర్గంలో ఏకగ్రీవమైతే దానికి స్థానిక నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు పూర్తయి ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో అధికారికంగా ప్రకటించినప్పటికీ... వైఎస్ జగన్ మాత్రం ఒక అడుగు ముందే వేసి మొదటి విడతగా 27 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కూడా విడుదల చేశారు. గ్రౌండ్ రిపోర్టుల ఆధారంగా ప్రజాదరణ కలిగిన బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తూ కొత్త ఎత్తుగడలతో ముందుకు వెళు తున్నారు.ఎన్నికల సమాచారం చూడండి.. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం లేదా పోలీస్ వ్యవస్థల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను, అక్రమాలను తట్టుకునేందుకు వీలుగా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక లీగల్ సెల్స్, మీడియా సెల్స్‌ను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా అధికార దుర్వినియోగ ఘటనలు జరిగితే వాటిని రికార్డ్ చేయడానికి 'డిజిటల్ డైరీ' విధానాన్ని తీసుకువచ్చారు.ఈ స్థానిక ఎన్నికలను కేవలం ఒక పోటీలా కాకుండా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని గ్రామ స్థాయి నుండి తిరిగి బలోపేతం చేసుకునే ఒక ప్రక్రియగా జగన్ భావిస్తున్నారు. అందుకోసం రీజనల్ కో-ఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలు చూసి క్యాడర్ లోనూ కసి పెరుగుతుందని, అది తమకు వచ్చే సాధారణ ఎన్నికల్లో అనుకూలంగా మారుతుందని జగన్ అంచనా వేశారు. అనుకున్నట్లుగానే క్యాడర్ ఏకతాటిపైకి రావడంతో జగన్ పాచిక పారినట్లయింది. అధికార కూటమి సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకుని పటిష్టంగా ఉన్న నేపథ్యంలో, జగన్ ముందస్తు వ్యూహాలు మరియు ఒంటరి పోరాటం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఓటర్లను ఆకర్షిస్తాయనే దానిపైనే ఆయన "పాచిక" సక్సెస్ ఆధారపడి ఉంటుంది. నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటే అది తమకు కలసి వస్తుందని అంచనా వేస్తున్నారు జగన్.

డీలిమిటేషన్ బిల్లుకు మద్దతిస్తారా? బీజేపీని వ్యతిరేకిస్తారా?

విజయవాడ ,అక్టోబరు 21 పెన్ పవర్:
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు మద్దతివ్వడంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారు. అలాగే కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులకు బహిరంగ మద్దతు తెలపడం జాతీయ రాజకీయాల్లో సరికొత్త రగడను రాజేసింది. గతంలో పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వానికి బేషరతుగా మద్దతు ఇచ్చి తప్పు చేశానని, చట్ట సవరణల విషయంలో పరోక్షంగా పశ్చాత్తాపపడిన జగన్, ఇప్పుడు నిజంగానే ఆచరణాత్మక వ్యతిరేకతను ప్రదర్శిస్తారా అనే చర్చ తీవ్రమవుతోంది. ఈ నెల చివర్లో లేదా రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో మోదీ ప్రభుత్వం అత్యంత కీలకమైన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురాబోతోందనే ప్రచారంతో జగన్ తీసుకోబోయే స్టాండ్ ఆయన రాజకీయ భవిష్యత్తుకు కొలమానంగా మారనుంది.వైఎస్సార్‌సీపీకి ప్రస్తుతం లోక్‌సభ మ, రాజ్యసభల్లో ఉన్న సభ్యుల సంఖ్య స్వల్పమే అయినప్పటికీ, రాజ్యసభలో సంకీర్ణ సమీకరణాలు , విపక్షాల ఐక్యతను చాటడంలో ఆ కొద్దిమంది ఎంపీల ఓట్లు కూడా అత్యంత కీలకం కానున్నాయి. గత ఐదేళ్ల పాటు నల్లచట్టాలు, కీలకమైన బిల్లులు, డిప్యూటీ స్పీకర్ ఎన్నికల వరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మక మద్దతు ఇస్తూ వచ్చింది. అయితే, ఏపీలో 2024 ఎన్నికల ఓటమి తర్వాత, టీడీపీ-జనసేనలతో బీజేపీ జట్టుకట్టడంతో జగన్ ఒంటరి అయ్యారు. ఇప్పుడు కేంద్రానికి మద్దతిచ్చి తప్పు చేశానా? అనే ఆలోచనలో ఉన్న జగన్, రాబోయే డీలిమిటేషన్ చట్టసభల బిల్లు విషయంలో ధైర్యంగా వ్యతిరేక ఓటు వేయగలరా అన్నదే అసలైన ప్రశ్నగా మారింది.ఈ విమర్శలు, సవాళ్ల మధ్య వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ మాత్రం డీలిమిటేషన్ , మహిళా బిల్లులకు సూత్రప్రాయంగా మద్దతు ఇస్తామని
ఇప్పటికే కొన్ని వేదికలపై సూచనలు ఇచ్చింది. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనలు దేశాభివృద్ధికి, దశాబ్దాల కల నెరవేర్చడానికి అవసరమైన ప్రాథమిక సంస్కరణలు అనే వ్యాఖ్యలతో వైఎస్సార్‌సీపీ ఎంపీలు సమర్థించుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయంగా బీజేపీకి వ్యతిరేకమని చెప్తూనే, ఇటువంటి ప్రజామోదయోగ్యమైన బిల్లులను రాజకీయాలకు అతీతంగా దేశ ప్రయోజనాల కోసం మద్దతిస్తున్నాం అని జగన్ ప్రకటిస్తే, అది మళ్లీ ఆయన్ను పాత పరోక్ష మద్దతు వైఖరిలోనే నిలబెడుతుంది. ఇక్కడే జగన్ మోహన్ రెడ్డి విశ్వసనీయతపై ప్రత్యర్థుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఢిల్లీ వీధుల్లో బీజేపీకి వ్యతిరేకంగా నిరసన తెలిపే ప్రొటెస్ట్ గ్రూపులకు, ఈసీ వ్యతిరేక ఉద్యమాలకు ట్విట్టర్ వేదికగా బాహాట మద్దతు ఇవ్వడం, మరోవైపు పార్లమెంట్ భవనంలోకి వచ్చేసరికి అదే బీజేపీ తీసుకొచ్చే రాజ్యాంగ సవరణ బిల్లులకు అనుకూలంగా ఓటు వేయడం ద్విముఖ వైఖరిని ఎండగడుతోంది. గతంలో తప్పు చేశానని జనం ముందు చెప్పడం, తీరా నిర్ణయాత్మక ఘట్టం వచ్చేసరికి మళ్లీ అదే తప్పును పునరావృతం చేయడం జగన్ రాజకీయ అనిశ్చితికి నిదర్శనం అని ప్రతిపక్షాలు ఎద్దేవా చేసే అవకాశం ఉంది. మరో కోణంలో చూస్తే, జగన్ ముందు రెండు స్పష్టమైన మార్గాలు
మాత్రమే మిగిలాయి. మొదటిది.. తాము విధానపరంగా బీజేపీతో పూర్తిగా తెగతెంపులు చేసుకున్నామని నిరూపించుకోవడానికి ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి కీలక బిల్లును సూటిగా వ్యతిరేకించడం, తద్వారా జాతీయ స్థాయిలో ఇండియా కూటమి లేదా ఇతర తటస్థ విపక్షాల సరసన నిలవడం. రెండోది.. జాతీయ అంశాలు వేరు, ప్రాంతీయ రాజకీయాలు వేరు అని చెప్తూ, భవిష్యత్తులో కేసుల ఒత్తిడి , కేంద్ర యంత్రాంగం నుంచి ఉపశమనం కోసం బిల్లులకు మద్దతు నిరంతరం కొనసాగించడం. కానీ, రెండో మార్గాన్ని ఎంచుకుంటే మాత్రం మళ్లీ తప్పు చేశానని భవిష్యత్తులో చింతించాల్సి వస్తుందనే విమర్శలను ఆయన తప్పించుకోలేరు. బిల్లులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నైతిక రాజకీయాలకు, సిద్ధాంతపరమైన స్టాండ్‌కు అసలైన అగ్నిపరీక్షగా మారనున్నాయి. మాటల్లో బీజేపీ వైఖరిని, ఎన్నికల వ్యవస్థను తప్పుబడుతున్న జగన్, చేతల్లో పార్లమెంట్ వేదికగా ఓటింగ్ సమయానికి ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఈ నిర్ణయమే రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ జాతీయ స్థాయి రాజకీయ భవిష్యత్తును, మిత్రులెవరో శత్రువులెవరో తేల్చే కీలక ఘట్టం కానుంది.

40 ఏళ్ల అనుభవానికి అవమానం.. మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి కన్నీటి పర్యంతం, టీడీపీకి గుడ్ బై

హైదరాబాద్ పెన్ పవర్: మున్సిపల్ ఎన్నికలు శ్రీకాకుళం టీడీపీలో ముసలం పుట్టించాయి. సిక్కోలు కార్పొరేషన్ సీటు ఇస్తామని ఆశ చూపి, ఇప్పుడు జనసేనకు కేటాయించడంపై మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మనస్తాపానికి గురయ్యారు. పార్టీలో తమ కుటుంబానికి అన్యాయం జరుగుతోందని, 40 ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్నందుకు అడుగడుగునా అమానిస్తున్నారని ఆరోపిస్తూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు లక్ష్మీదేవి ప్రకటించారు. ఆమె భర్త మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ 1983 నుంచి 2004 వరకు శ్రీకాకుళం ఎమ్మెల్యేగా పనిచేశారు. లక్ష్మీదేవి 2014 నుంచి 2019వరకు ఎమ్మెల్యేగా వ్యవహరించారు. అయితే 2024 ఎన్నికల్లో గుండ కుటుంబాన్ని తప్పించి, మేయర్ సీటు ఇస్తామని పార్టీ అధిష్టానం ప్రతిపాదించినట్లుగా చెబుతున్నారు. అయితే ఇప్పుడు సర్దుబాట్లలో భాగంగా జనసేనకు కేటాయించడాన్ని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు.

40 ఏళ్ల బంధం.. కన్నీటి పర్యంతం

టీడీపీకి రాజీనామా చేయాల్సిన పరిస్థితులను వివరిస్తూ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కన్నీటి పర్యంతం అయ్యారు. శ్రీకాకుళంలో టీడీపీకి వెన్నుదన్నుగా వస్తున్న గుండ కుటుంబం ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సిరావడంపై కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళంలో పార్టీ పురోగతి కోసం మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులు ఎంతో కృషి చేశారని చెబుతున్నారు. అయితే వయోభారం వల్ల గుండ అప్పలసూర్యనారాయణ ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారని, అయినప్పటికీ తన భార్యను ముందుంచి పెద్దదిక్కుగా పార్టీని నడిపించారని గుర్తు చేస్తున్నారు. ఆయన మరణం తర్వాత పార్టీ అండగా నిలవాల్సిందిపోయి మాజీ ఎమ్మెల్యే కుటుంబాన్ని అవమానించేలా వ్యవహరించడంతోనే రాజీనామా నిర్ణయం తీసుకుందని విశ్లేషిస్తున్నారు.

మేయర్ సీటుపై పేచీ

గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీకి గుండ లక్ష్మీదేవి ప్రయత్నించారని చెబుతున్నారు. అయితే అధిష్టానం కొత్తవారికి యువతకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనతో ప్రస్తుత ఎమ్మెల్యే శంకర్ కు టికెట్ ఇచ్చిందని చెబుతున్నారు. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవికి శ్రీకాకుళం నగర మేయర్ పదవి ఇస్తామని ఆశ పెట్టినట్లుగా చెబుతున్నారు. ఈ కారణంగా అప్పట్లో గుండ కుటుంబం కూడా అధిష్టానంతో రాజీ పడిందని అంటున్నారు. అయితే మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ మరణం, గుండ కుటుంబంలో రాజకీయంగా చురుగ్గా తిరిగే వారు లేరన్న ఆలోచనతో సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్ పట్టుబిగించినట్లు చెబుతున్నారు. లక్ష్మీదేవిని మేయర్ చేస్తే మరో అధికార కేంద్రం తయారు చేసినట్లు అవుతుందన్న భావనతో వ్యూహాత్మకంగా మేయర్ సీటును జనసేనకు వదిలేశారని అంటున్నారు. ఇది గమనించిన లక్ష్మీదేవి పార్టీలో తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతుందని భావిస్తూ తెగతెంపులు చేసుకోవాలని నిర్ణయానికి వచ్చారని అంటున్నారు.

విగ్రహం పెట్టనీయలేదన్న ఆవేదన

ఇక టీడీపీకి మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి రాజీనామా చేయడానికి అనేక కారణాలు ఉన్నాయని అంటున్నారు. ప్రధానంగా మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ మరణించిన తర్వాత నగరంలో ఆయన విగ్రహం పెట్టాలని అభిమానులు భావించారని చెబుతున్నారు. ఈ ప్రతిపాదనను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినా, స్థానికంగా అడ్డంకులు సృష్టించడంపై మాజీ ఎమ్మెల్యే అసంతృప్తికి లోనరయ్యారని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఈ విషయంలో సానుకూలంగా ఉన్నప్పటికీ కలెక్టర్ ద్వారా స్థానిక నాయకులు అడ్డుకున్నారని మాజీ ఎమ్మెల్యే మీడియాకు తెలిపారు. దీంతో పార్టీలో 40 ఏళ్ల సేవలకు కూడా గుర్తింపు దక్కలేదన్న ఆవేదన ఆమెలో కనిపిస్తోందని అంటున్నారు.

వైసీపీలో చేరతారా?

టీడీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి భవిష్యత్తు రాజకీయాలపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. టీడీపీ ఆవిర్భావం నుంచి పసుపు కండువాతోనే రాజకీయం చేసిన లక్ష్మీదేవి తాజా పరిణామాలతో వైసీపీలో చేరతారని ప్రచారం జరుగుతోంది. త్వరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ తరఫున మేయర్ సీటు ఇస్తామని ఆ పార్టీ నుంచి ఆఫర్ ఉందని అంటున్నారు. ఈ కారణంతోనే లక్ష్మీదేవి రాజీనామా నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. అయితే లక్ష్మీదేవిని నచ్చజెప్పే ప్రయత్నాలు ఒకవైపు జరుగుతున్నాయని, మాజీ ఎమ్మెల్యేను టీడీపీ అంత తేలిగ్గా వదులుకోదని మరోవైపు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం రాజకీయం ఆసక్తికరంగా మారిందని చెబుతున్నారు.

జగన్‌ను ర్యాగింగ్ చేసిన విజయసాయి!

విజయవాడ ,అక్టోబరు 21 పెన్ పవర్: మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి దసరా పండుగ సందర్భంగా తాను స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీకి సంబంధించిన ముహూర్తాన్ని, ఆశయాలను వెల్లడిస్తూ కీలక ప్రకటన చేశారు. ఈ క్రమంలో ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలే ఎజెండాగా కొత్త పార్టీ ఆవిర్భవించబోతోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2 పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలకడం, కులపిచ్చి, మతపిచ్చి రాజకీయాలను రూపుమాపడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. అలాగే రెడ్ బుక్ రాజ్యాంగం, రప్పారప్పా ఫ్యాక్షన్ల నుంచి విముక్తి కల్పించి, కరువు కాటకాలు, కరెంటు కోతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తామని దసరా పండుగరోజు మాజీ ఎంపీ ప్రకటించారు.విజయసాయిరెడ్డి తన కొత్త పార్టీ ప్రకటన తేదీని, ముహూర్తాన్ని ప్రకటించారు. అన్నీ పదకొండులు వచ్చేలా చూసుకున్నారు. గతంలో దసరాకే పార్టీ పెడతానని చెప్పిన ఆయన .. పార్టీ పెట్టే రోజును దసరా రోజునుప్రకటించారు. ఆ రోజును, ముహూర్తాన్ని చూస్తే ఆయన జగన్ రెడ్డిని ర్యాగింగ్ చేశారని సులువుగా అర్థమైపోతుంది. 11వ నెల 11వ తేదీన సరిగ్గా ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ-కన్వెన్షన్‌లో నూతన పార్టీని ఘనంగా ఆవిష్కరించనున్నట్లు ప్రకటించారు.గత ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘోర పరాజయం పాలై కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైంది. అప్పట్నుంచి 11 అంటే వైసీపీ నేతలు ఉలిక్కి పడుతున్నారు. విపక్ష హోదా కూడా దక్కకుండా చేసిన ఆ 11 సంఖ్య జగన్‌కు, వైఎస్సార్సీపీ శ్రేణులకు రాజకీయంగా ఒక పెద్ద పీడకలగా మారింది. అలాంటి పచ్చి పుండుపై కారం చల్లేలా.. విజయసాయిరెడ్డి తన పార్టీ ప్రకటన ముహూర్తంలో నెల, తేదీ, గంటలు, నిమిషాలు అన్నీ కలిపి వరుసగా 11:11:11:11 వచ్చేలా పక్కాగా సెట్ చేశారు. గతంలో జగన్‌కు ఆర్థిక, రాజకీయ సలహాదారుగా నిలిచి లెక్కల మాస్టారు గా పేరుగాంచిన సాయిరెడ్డి.. ఇప్పుడు అదే లెక్కలతో జగన్ ఓటమి సంఖ్యను గుర్తుచేస్తూ పబ్లిక్‌గా ట్రోల్ చేశారుకేవలం ముహూర్తంతోనే ఆగకుండా పార్టీ ఎజెండా ద్వారా కూడా జగన్ పాలనను, వైఎస్సార్సీపీ మూలాలను విజయసాయిరెడ్డి తీవ్రంగా ఎద్దేవా చేశారు. రెండు పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలికేలా.. రప్పరప్ప ఫ్యాక్షన్ల నుంచి విముక్తి కల్పించేలా.. జెన్-జీ నాయకుల తయారీ ఫ్యాక్టరీగా తమ పార్టీ వస్తోందని పోస్టర్‌లో పేర్కొనడం జగన్‌ను నేరుగా టార్గెట్ చేయడమే. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత ప్రయోజనాలు చూసుకున్నారని, యువతను కేవలం జేజేలు కొట్టే గుంపులుగా మార్చారని దశకంఠుడి అవలక్షణాలంటూ 10 పాయింట్లతో జగన్ రాజకీయ తీరును ఉతికి ఆరేశారు. నిన్నటిదాకా తమతో ఉన్న ముఖ్య నేతే ఇలా 11 నంబర్‌తో వ్యంగ్యాస్త్రాలు సంధించడం తాడేపల్లి ప్యాలెస్‌కు మింగుడుపడటం లేదుకొన్ని రోజుల కిందట విజయసాయిరెడ్డి పార్టీ ఆవిర్భావం ప్రకటన చేయాల్సి ఉండగా.. అనారోగ్యం కారణంగా వాయిదా వేసుకున్నట్లు ప్రకటించారు. ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్నానని, త్వరలోనే పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేస్తానన్నారు. అయితే వైసీపీ నుంచి బెదిరింపులకు పాల్పడటంతో ఆయన వెనక్కి తగ్గారని, మరికొన్ని వర్గాల వారు విజయసాయిరెడ్డిని భయపెట్టడంతో మాజీ ఎంపీ వెనక్కి తగ్గారని ప్రచారం జరిగింది. అయితే తాను పార్టీ పెట్టడంలో వెనక్కి తగ్గేదిలేదని, తనను ఎవరూ బెదిరించలేదన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు కోసం కచ్చితంగా తన పోరాటం కొనసాగుతుందన్నారు.

అలసటతో టీమిండియా.. సొంతగడ్డపై కివీస్ జోరు.. తొలి టీ20 రసవత్తరం

భారత్-న్యూజిలాండ్ మధ్య ఐదు టీ20ల సిరీస్

తొలి మ్యాచ్‌కు క్రైస్ట్‌చర్చ్ ఆతిథ్యం

బుమ్రా, హార్దిక్ లేకుండానే భారత్ బరిలోకి

ప్రయాణ అలసట నుంచి కోలుకోవాల్సిన టీమిండియా

న్యూజిలాండ్ పేస్ బౌలింగ్‌తో భారత్‌కు సవాల్

న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌కు భారత్ సిద్ధమైంది. అయితే, ఈసారి టీమిండియాకు ఎదురయ్యేది సాధారణ సవాల్ కాదు. వరుస ప్రయాణాలతో అలసట, కీలక ఆటగాళ్ల గైర్హాజరు, పేసర్లకు అనుకూలించే పరిస్థితులు.. ఇలా ఎన్నో సవాళ్లు భారత జట్టుకు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు, సొంతగడ్డపై బలంగా కనిపిస్తున్న న్యూజిలాండ్ తొలి మ్యాచ్‌లోనే పైచేయి సాధించాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం క్రైస్ట్‌చర్చ్‌లో జరగనున్న తొలి టీ20 ఆసక్తికరంగా మారింది.

భారత జట్టుకు ఈ సిరీస్‌కు ముందు విశ్రాంతి తీసుకునే అవకాశం పెద్దగా లభించలేదు. అక్టోబర్ 3న జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన అనంతరం, అక్టోబర్ 6 నుంచే వెస్టిండీస్‌తో స్వదేశంలో టీ20 సిరీస్ ఆడింది. బెంగళూరులో అక్టోబర్ 17న జరగాల్సిన నిర్ణయాత్మక మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో ఆ సిరీస్ 2-2తో ముగిసింది. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు చేరుకున్న భారత జట్టుకు క్రైస్ట్‌చర్చ్‌లో ఒక్కటే ప్రాక్టీస్ సెషన్ లభించింది. ప్రయాణ అలసట నుంచి కోలుకోవడం ఆటగాళ్లకు కీలకం కానుంది.జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌కు దూరంగా ఉండటం భారత్‌కు ఎదురుదెబ్బ. టెస్టు సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని బుమ్రాకు విశ్రాంతి ఇచ్చారు. హార్దిక్ మాత్రం మార్చిలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. దీంతో బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ జట్టు కూర్పుపై మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది.మరోవైపు, న్యూజిలాండ్ జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఇటీవల భారత్‌లో టెస్టు, వన్డే సిరీస్‌లను గెలిచిన ఆ జట్టు.. ఈసారి తమ ప్రధాన ఆటగాళ్లలో ఎక్కువమందితో బరిలోకి దిగుతోంది. గాయాల కారణంగా మార్క్ చాప్‌మన్, రచిన్ రవీంద్ర అందుబాటులో లేకపోయినా, ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, డెవాన్ కాన్వే వంటి ఆటగాళ్లతో టాప్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. ముఖ్యంగా స్వదేశంలో అలెన్ దూకుడు భారత్ బౌలర్లకు పరీక్షగా మారొచ్చు. జాకబ్ డఫీ, మాట్ హెన్రీ, ఆడమ్ మిల్నే, లాకీ ఫెర్గూసన్ వంటి పేసర్లు న్యూజిలాండ్ బౌలింగ్‌కు అదనపు బలం.భారత తుది జట్టు ఎంపిక కూడా ఆసక్తికరంగా మారింది. ఆసియా వెలుపల స్పిన్ ఆల్‌రౌండర్ల ప్రభావం తగ్గే అవకాశం ఉండటంతో నమన్ ధీర్ స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే ఇద్దరికీ అవకాశం కల్పించే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. తిరిగి జట్టులోకి వచ్చిన భువనేశ్వర్ కుమార్ ఆడే అవకాశం ఉంది. ఫిట్‌నెస్ సాధించిన వరుణ్ చక్రవర్తి స్థానంలో మూడో పేసర్‌గా ప్రిన్స్ యాదవ్‌ను తీసుకుంటారా అన్నది చూడాలి.

క్రైస్ట్‌చర్చ్‌లో మ్యాచ్ ప్రారంభమయ్యే రాత్రి 8 గంటల సమయానికి చలి పెరిగే అవకాశం ఉంది. సీజన్ ప్రారంభంలో ఉండే తాజా పిచ్ పేసర్లకు సహకరించొచ్చు. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం కూడా ఉండే అవకాశంతో టాస్ గెలిచిన జట్టు ఛేజింగ్‌కు మొగ్గు చూపవచ్చు.

అయితే, గత రికార్డులు భారత్‌కు కొంత ఊరటనిస్తున్నాయి. న్యూజిలాండ్‌తో జరిగిన చివరి రెండు ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లను భారత్ గెలుచుకుంది. 2020 జనవరి నుంచి ఇప్పటివరకు ఇరు జట్ల మధ్య పూర్తయిన 20 టీ20ల్లో 16 మ్యాచ్‌ల్లో టీమిండియాదే విజయం. వ్యక్తిగతంగా ఇషాన్ కిషన్‌పైనా అందరి దృష్టి ఉంది. ఈ క్యాలెండర్ ఏడాదిలో టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉన్న 1,164 పరుగుల రికార్డును అధిగమించాలంటే ఇషాన్ మరో ఏడు పరుగులు చేయాలి. ప్రేక్షకులతో కిక్కిరిసే హాగ్లీ ఓవల్‌లో ఈ రికార్డు సాధిస్తాడా అన్నది ఆసక్తికరం.మ్యాచ్ వివరాలు: అక్టోబర్ 22, గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం. వేదిక క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్. టీవీలో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానళ్లలో, ఆన్‌లైన్‌లో సోనీ ూ×ం యాప్, వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారం చూడవచ్చు.

టీమిండియాకు భారీ ఎదురుదెబ్బ.. ఐపీఎల్ 2027 వరకు హార్దిక్ పాండ్యా దూరమేనా?

- ఐపీఎల్ 2027 వరకు ఆటకు పాండ్యా దూరమయ్యే అవకాశం ఉందంటున్న నివేదికలు
- బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స
- మరో మూడు వారాల తర్వాత జాగింగ్ ప్రారంభించే అవకాశం
- ఆ తర్వాత ఎనిమిది వారాల్లో పరుగుల సాధన క్రమంగా పెంపు
- శ్రీలంక, జింబాబ్వే సిరీస్‌లకు దూరమయ్యే ప్రమాదం

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అభిమానులకు నిరాశ కలిగించే వార్త. అతడు మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఓ నివేదిక వెల్లడించింది. కాలి కండరాల లోపలి భాగంలో ఏర్పడిన స్ట్రైన్ గాయం నుంచి కోలుకుంటున్న హార్దిక్.. వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్న ఐపీఎల్ 2027 వరకు పోటీ క్రికెట్‌కు దూరంగా ఉండొచ్చని తెలిపింది. అయితే, అతడి పునరాగమనంపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.ప్రస్తుతం హార్దిక్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాస చికిత్స తీసుకుంటున్నాడు. 'దైనిక్ జాగరణ్' కథనం ప్రకారం.. అతడి వైద్య నివేదికలను గత వారం డాక్టర్ దిన్‌షా పార్దివాలా పరిశీలించారు. వైద్యుల సూచనల మేరకు దశలవారీగా ఫిట్‌నెస్ సాధించే కార్యక్రమాన్ని హార్దిక్ కొనసాగిస్తున్నాడు.పునరావాస ప్రణాళిక ప్రకారం మరో మూడు వారాల తర్వాత అతడు నెమ్మదిగా జాగింగ్ ప్రారంభించే అవకాశం ఉంది. ఆ తర్వాతి ఎనిమిది వారాల్లో పరుగెత్తే సమయాన్ని, తీవ్రతను క్రమంగా పెంచనున్నారు. గాయంపై మళ్లీ ఒత్తిడి పడకుండా స్ట్రెంత్ ట్రైనింగ్‌ను కూడా జాగ్రత్తగా పెంచుతున్నారు. పూర్తి స్థాయి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించడానికి ఎంత సమయం పడుతుందనే దానిపై ఇంకా స్పష్టత లేదు.

ఈ పరిస్థితి కొనసాగితే డిసెంబర్ 13 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంకతో వన్డేలు, టీ20ల సిరీస్‌కు హార్దిక్ దూరమయ్యే అవకాశం ఉంది. జనవరి 3 నుంచి జరగనున్న జింబాబ్వేతో వన్డే సిరీస్‌లోనూ ఆడకపోవచ్చని నివేదిక పేర్కొంది. ఇప్పటికే అతడు న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక కాలేదు.2026లోనూ హార్దిక్ పలు సిరీస్‌లకు దూరమయ్యాడు. అతడు చివరిసారిగా ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తరఫున మే నెలలో మ్యాచ్ ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో చివరిసారిగా మార్చిలో జరిగిన 2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో కనిపించాడు. హార్దిక్ త్వరగా కోలుకోవడం టీమిండియాకు కీలకం కానుంది.

ఐపీఎల్ రికార్డుల వీరుడు.. ఇక ఢిల్లీ స్పిన్నర్లకు గురువు

భారత మాజీ లెగ్ స్పిన్నర్, ఐపీఎల్ రికార్డుల వీరుడు అమిత్ మిశ్రా తన క్రికెట్ ప్రస్థానంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. రాబోయే 2027 ఐపీఎల్ సీజన్‌కు గాను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా అతడు నియమితులయ్యాడు.

విశేషమేమిటంటే.. 2008లో తన ఐపీఎల్ ప్రయాణాన్ని ఏ జట్టుతో అయితే ప్రారంభించాడో, అదే జట్టుతో ఇప్పుడు కోచింగ్ కెరీర్‌ను మొదలుపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ అధికారికంగా ప్రకటించింది.ఈ నియామకం పై అమిత్ మిశ్రా సంతోషం వ్యక్తం చేశాడు. "ఢిల్లీ దిల్ వాలోం కీ హై (ఢిల్లీది పెద్ద మనసు). నేను తొలిసారి ఐపీఎల్ ఆడినప్పుడు ఢిల్లీ జట్టులో భాగమయ్యాను. ఇప్పుడు నా కోచింగ్ కెరీర్‌ను కూడా ఢిల్లీతోనే ప్రారంభిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఢిల్లీ నా గుండెచప్పుడు. ఎన్నో ఏళ్లుగా ఢిల్లీ అభిమానులు ఎదురుచూస్తున్న ఆనందాన్ని, విజయాన్ని వారికి అందించడానికి గట్టిగా ప్రయత్నిస్తాం" అని ఫ్రాంచైజీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియోలో మిశ్రా పేర్కొన్నాడు.43 ఏళ్ల అమిత్ మిశ్రా 2025 సెప్టెంబర్‌లో అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఐపీఎల్‌లో కోచింగ్ బాధ్యతలు చేపట్టడం అతనికి ఇదే తొలిసారి. తన ఫ్లైటెడ్, స్లో లెగ్ బ్రేక్‌లతో బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన మిశ్రాకు ఐపీఎల్‌లో అద్భుతమైన రికార్డు ఉంది. ఈ లీగ్ చరిత్రలో మూడు హ్యాట్రిక్‌లు (2008, 2011, 2013) సాధించిన ఏకైక బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. 2008 నుంచి 2024 వరకు ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ (గతంలో డేర్‌డెవిల్స్), డెక్కన్ ఛార్జర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 162 మ్యాచ్‌లలో 7.37 ఎకానమీ రేటుతో 174 వికెట్లు పడగొట్టాడు.గత కొన్ని సీజన్లుగా పేలవ ప్రదర్శనతో నిరాశపరుస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్, జట్టును పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడింది. గత సీజన్‌లో ఆరో స్థానంలో నిలిచిన ఈ జట్టు ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ గెలవలేదు. ఈ క్రమంలోనే భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని కొత్త హెడ్ కోచ్‌గా నియమించింది.

దుర్గా అష్టమి మరియు మహా నవమి కోసం సీరత్ కపూర్ బ్లాక్ కోచర్‌లో స్టన్స్

దేవరకొండ ఇప్పుడు చేయాల్సిందేంటి?



ఒక సినిమా కోసం హీరో ఎంత కష్టపడ్డారనేది మెయిన్. కానీ ఆ కష్టం ప్రేక్షకులకు ఎంతవరకు నచ్చిందన్నదే రిజల్ట్ డిసైడ్ చేస్తుంది. విజయ్ దేవరకొండ విషయంలో ఇదే డిస్కస్ చేసుకోవాల్సిన విషయం. రణబాలిలో ఆయన యాక్టింగ్ కు మంచి మార్కులే పడుతున్నా.. కొన్ని విషయాల్లో మాత్రం ప్రేక్షకులకు అసంతృప్తి ఉంది. దీంతో నటుడిగా నిరూపించుకున్న ఆయన.. సెలక్షన్ లో జాగ్రత్తగా ఉండాల్సిన సమయం వచ్చిందా అనే ప్రశ్న వినిపిస్తోంది.

నిజానికి రణబాలిలో విజయ్ దేవరకొండ తన పాత్ర కోసం చాలా కష్టపడ్డారు. రోల్ కు తగ్గట్టుగా కనిపించడం దగ్గర నుంచి యాక్షన్ సీన్స్, డైలాగులు చెప్పే విధానం వరకు తనదైన ముద్ర వేశారు. రణబాలి రోల్ లో చూపించిన ఇంటెన్సిటీ సినిమాకు మెయిన్ అసెట్ గా నిలిచింది. రష్మిక మందన్నా కూడా తన పాత్రకు న్యాయం చేశారు. డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ సెలెక్ట్ చేసుకున్న బ్యాక్ డ్రాప్, రూపొందించిన కొన్ని సీన్స్, క్లైమాక్స్ అట్రాక్ట్ చేస్తున్నాయి.

అయితే మంచి స్టోరీ ఉన్నంత మాత్రాన సినిమా మొత్తం ప్రేక్షకులను కట్టిపడేయలేదని ఆ మూవీ మరోసారి గుర్తు చేసింది. కొన్ని చోట్ల స్టోరీ స్లోగా సాగడం, సినిమా రన్ టైమ్ ఎక్కువగా అనిపించడం ఇబ్బందిగా మారాయి. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను చూపించే క్రమంలో వైలెన్స్ కూడా ఎక్కువైంది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలోనూ మరింత స్ట్రాంగ్ వర్క్ ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంటే విజయ్ యాక్టింగ్ కంటే, ప్రేక్షకులకు నచ్చేలా మూవీ తీర్చిదిద్దడంలోనే సమస్య ఉందని చెప్పొచ్చు. అయితే విజయ్ కు ప్రస్తుతం మంచి అవకాశాలున్నాయి. రౌడీ జనార్దన, దర్శకుడు శౌర్యువ్ తో చేయనున్న సినిమాలు లైనప్ లో ఉన్నాయి. ఆ రెండు చిత్రాలు వేర్వేరు బ్యాక్ డ్రాప్స్ లో రూపొందుతున్నాయి. ఒకటి గ్రామీణ వాతావరణంలో సాగే మాస్ యాక్షన్ కథ కాగా, మరొకటి ఎమోషన్స్ తో కూడిన ఫాంటసీ స్టోరీ.అందుకే విజయ్ ఇప్పుడు చేయాల్సింది కొత్త స్టోరీలను ఎంచుకోవడం మాత్రమే కాదు. అందులో కొన్ని మార్పులు చేసుకోవాలి. స్టోరీలో కొత్తదనం ఉందా, తన పాత్రకు స్ట్రెంత్ ఎంత, ప్రేక్షకులు మొదటి నుంచి చివరి వరకు ఆసక్తిగా చూస్తారా అనే విషయాలను ముందుగానే పరిశీలించాలి. దర్శకుడి ఆలోచన ఎంత బాగున్నా, అది స్క్రీన్ పై అంతే స్ట్రాంగ్ కనిపించేలా ఉండాలి. ఇక విజయ్ లో కొత్త కథలు చేయాలనే ఆసక్తి కనిపిస్తుంది, మంచి క్రేజ్ కూడా ఉంది.

ఆ రెండింటినీ కలిపి ముందుకు వెళ్లడం ఇప్పుడు చాలా అవసరం. కేవలం భారీ బ్యాక్ డ్రాప్, కొత్త లుక్, ఎక్కువ యాక్షన్ ఉంటే సినిమా సక్సెస్ అవుతుందని అనుకోకూడదు. స్ట్రాంగ్ స్టోరీ, ఎమోషన్స్, స్పీడ్ స్క్రీన్ ప్లే కూడా అంతే ముఖ్యం. అందుకే ఇప్పుడు ఆయన ఫోకస్ పెట్టాల్సింది స్టోరీల సెలక్షన్ తోపాటు అవి స్క్రీన్ పై ఎలా చూపిస్తారనే విషయంపై కూడా. విజయ్ నెక్ట్స్ సినిమాల్లో చిన్న చిన్న ఛేంజెస్ చేసుకుంటే కచ్చితంగా మంచి రిజల్ట్ రావొచ్చు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com